ఎన్.టి.ఆర్.
ఓ అధ్యయన గ్రంథం

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మే 24, 2015

రుతు రాగాలు

వదల బొమ్మాళి... రికార్డులనూ వదల్లేదు. కాళ భైరవను అడ్డుకోడానికి ఒక్కసారే వంద మందిని షేర్‌ఖాన్ పంపినా వసూళ్ల రికార్డులను చేధించాడు. ఈగే కదా అనుకుంటే జపాన్ వరకూ ఎగిరిపోయింది. విజువల్ ఎఫెక్ట్స్, టెక్నికల్ వాల్యూస్‌లో ఎక్కడా తగ్గకుండా భారీ బడ్జెట్‌తో వెండి తెరను ధగధగలాడించాయి. కొన్నిరోజుల్లో రుద్రమదేవి, బాహుబలి వంటి మరిన్ని భారీ చిత్రాలు విడుదల కాబోతున్నాయి. వీటితో భారతీయ సినీ ప్రపంచంలో తెలుగు తెర రీ రికార్డులను ప్రదర్శిస్తుందేమో.

జేజమ్మ జైత్రయాత్ర

అమ్మోరు, దేవి సినిమాలతో తెలుగు తెరకు విజువల్ గ్రాండ్‌నెస్ తీసుకువచ్చిన దర్శకుడు కోడిరామకృష్ణ. ఆయన దర్శకత్వంలోనే వచ్చిన అరుంధతి అప్పట్లో భారీ బడ్జెట్ చిత్రమే. అంత బడ్జెట్ ఓ వుమెన్ ఓరియెంటెడ్ కథకు పెట్టేందుకు వెనకడుగు వేయకపోవడానికి కారణం అమ్మోరు, దేవి అందించిన వసూళ్లే. నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి అరుంధతికి 13 కోట్ల రూపాయల్ని ఖర్చుచేస్తే 34 కోట్ల రూపాయల వరకు వసూళ్లను సాధించింది. అనుష్క, సోను సూద్‌ల పేరును రెండింతలు చేసింది. ఈ సినిమాను తమిళ, మళయాళీ భాషల్లోకి డబ్ చేశారు. బెంగాలీలో పునర్నిర్మించారు.

'రీ' రికార్డ్‌లు

300 ఏళ్లకు తగ్గట్టు...

'మగధీర' చరిత్రలో నిలిచిపోయే చిత్రం. హాలీవుడ్ రేంజ్ కొలతతో మాట్లాడుతూ మన సినిమాను తక్కువ చేసేవారికి సమాధానం. కేవలం బడ్జెట్, వసూళ్లకే దీని ప్రత్యేకత పరిమితం కాదు. రాజమౌళి దర్శక మాయాజాలం, రామ్‌చరణ్ నటకౌశలంతో పాటు అన్ని విభాగాల్లో తెలుగు సినీ నిపుణుల అద్భుత ప్రతిభకు నిదర్శనం. 30 కోట్లతో నిర్మించిన ఈ సినిమా 300 ఏళ్ల ప్రణయ బంధాన్ని చక్కగా ఆవిష్కరించింది. సుమారు 76 కోట్ల రూపాయల వసూళ్లు సాధించి నంబర్ వన్ స్థానాన్ని తేలిగ్గా కైవసం చేసుకుంది.

రీవీగ...

రాజమౌళి 'ఈగ' శూలంలా సూదిని పట్టుకుని విలన్‌ను వెంటాడుతుంటే, అది చూసేందుకు సినీ జనాలు థియేటర్ల వెంట పడ్డారు. 'ఈగ' జపాన్ చిత్ర ప్రేమికులను ఆకట్టుకుని అవార్డులను దక్కించుకుని రీవీగా పోజులిచ్చింది. సుమారు ముప్పై కోట్ల బడ్జెట్‌లో చాలా డబ్బు సీజీ వర్క్‌కే ఖర్చుచేశారు. 'ఈగ' టీమ్ కష్టం వృథా పోలేదు. నలభై కోట్ల వసూళ్లను ఇట్టే పట్టేసింది.

భారీధనమే...

అంతకు మించి అంటూ బడ్జెట్‌కు, రికార్డుకు కొత్త విలువ కట్టాడు 'ఐ'తో శంకర్. సుమారు 145 కోట్లను మంచినీళ్లలా ఖర్చుచేసేశారు. కేవలం చైనా షూటింగ్‌కే రోజులతో సమానంగా కోట్లు కరిగిపోయాయి. బీస్ట్ పాటను వ్యయంతో తెరకెక్కించారు. మేకప్‌లు, లొకేషన్లు, సెట్టింగ్‌లు, విజువల్స్, ఫైట్స్ అంతటా భారీదనమే. తమిళ్, తెలుగు, హిందీల్లో విడుదలైన ఈ సినిమా 200 కోట్లకు పైగానే వసూళ్లు సాధించింది.

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

తాళం తిప్పలు

తాళం చిన్నదే కావొచ్చు. అది కావలి కాసే ఇంటికి... మూటకి ... మాత్రం పెద్ద చిన్న అన్న తేడాల్లేవు. పరిమాణంతో ప్రమేయం లేకుండా కాపలా కాయడమే దాని ప్రధాన విధి.

ఉద్యోగానికి వెళ్లాలన్నా, ఊరెళ్లాలన్నా ఇంటికి బీగం వేయాల్సిందే. తాళం సరిగ్గా పడిందీ లేనిదీ ఒకటికి పది సార్లు శక్తికొలదీ పరీక్షించాల్సిందే. అయినా సరే! ఒక్కోసారి మార్గ మధ్యలో వుండగా అనుమానమొస్తుంది. తాళం సరిగ్గా పడిందా లేదా అని. ఆ అనుమానమనే పురుగు పుట్టిందీ అంటే తొలుస్తూనే వుంటుంది. నిర్ధారణ చేసుకునే వరకూ.

❑ ❑ ❑

కొందరికి ఒక తాళం మీద విశ్వాసం వుండదు. ఇంటికి రెండేసి మూడేసి తాళాలు వేసే వారూ తారసపడుతుంటారు. అలా తమకు తెలీకుండానే చూపరులకు చిరునవ్వులు ప్రసాదిస్తుంటారు.

తాళం వల్ల నిరాశానిస్పృహలకు గురయ్యే సందర్భాలూ వుంటాయి. ఎక్కడో వున్న నేస్తాన్ని ...ఎన్నో ప్రయాసలకోర్చి... కలుద్దామని వెళ్లినప్పుడు ... తాళం కప్ప స్వాగతం పలికితే! నిలువెల్లా నీరసం ఆవహించక ఏమౌతుంది!

❑ ❑ ❑

ఇక ఈ తాళం విషయంలో కలిగే మతిమరుపు సమస్య అంతా ఇంతా కాదు. ఆ చిన్ని తాళం చెవి ఎక్కడ పెట్టింది మర్చిపోయి ఇల్లంతా వెతకాల్సి రావడం నరకమే! అంత ముఖ్యమైన తాళాన్ని పోగొట్టుకుంటే! మారు తాళం కోసం పరుగులు తీయక తప్పదు. అంత చిత్రం లేదనుకుంటే ... పగలకొట్టేసి కొత్తది కొనుక్కోవాల్సిందే.

❑ ❑ ❑

◆ మనలో మాట

చోరాగ్రేసరుల కళ్లన్నీ చీకట్లో సైతం తాళం వేసిన ఇళ్ల మీదే వుంటాయి. అలాంటి ఇళ్లల్లోకి చొరబడితే చాలు! పండుగే అనుకుంటారు. వీలుని బట్టి దొరికింది చుట్టబెట్టేస్తారు. ఒక్కోసారి తామే దొరికిపోతుంటారు కూడా. ఆ తర్వాత జరిగే 'సన్మానం' సంగతి అందరికీ తెలిసిందే.

ఈ తాళాలను సేకరించడమే పని కొందరికి. అలా రికార్డు సృష్టించే వారూ వున్నారు. అంతెందుకు! తాళాల మ్యూజియంలు కూడా వుంటేను. వ్యాపారస్తులు దేన్నీ విడిచిపెట్టరు కదా. వాణిజ్య ప్రకటనల్లో తాళాలను సైతం వాడేస్తుంటారు. సంతోషాలకు తాళం చెవులంటూ మన చెవుల్లో పువ్వులు పెట్టేస్తుంటారు.

❑ ❑ ❑

నిజానికి అన్నిటికీ అన్ని వేళలా... తాళాలు వేయడం మంచిది కాదు. ముఖ్యంగా మన నోటికి. ఉద్యోగాలిస్తామని, ఇళ్లిస్తామని, చుక్కల నంటిన నిత్యావసరాల ధరలను నేల మీదకు తెస్తామని, చిన్నారులకు చదువులు అందిస్తామని ... ఎన్నికల వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన నేతలను భరించాల్సిన పని లేదు. మన నోళ్లకు స్వయంగా వేసుకున్న బీగాలను తీసి శక్తి కొలదీ విసిరేయాలి. మౌనం వీడి...గళమెత్తి...పోరాడాలి.

■



టపా

భలే కపుల్

పోల్ కపుల్ విన్యాసాలు బాగున్నాయి. ఎంతో శ్రమతో కూడిన విషయం. ఎంతో జాగ్రత్తగా బ్యాలెన్స్ చేయాలి. ఒంటరి నిర్మాణం చూడముచ్చటగా ఉంది. వ్యర్థాలతోనే అద్భుతాలు చేయగలరని నిరూపించారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒకటి ఇష్టం ఉంటుంది. అలాగే లంక వారికి రావణుడు ఆరాధ్యుడు. కొంత మంది మంచి వారని కొలుస్తారు. కొంత మంది దుర్మార్గులని తలుస్తారు. వారి ఇష్టం వారిది. ఈ వారం నటి కృష్ణకుమారి గురించి ఇచ్చారు. సినిమాకు కథాబలం. నాయికా, నాయికల నటన వినోదంతోపాటు ఒక సందేశం ఉంటుంది. ప్రజలకు నచ్చాలి. నవరసాలు కలబోసిన సినిమా. ఏదైనా ఒక కొత్త ఆవిష్కరణ గురించి ఇంత గొప్పగా వర్ణించారు రచయిత. కొత్త ఆవిష్కరణ గురించి పరిచయం చేస్తే గొప్పగా ప్రచారం జరుగుతోంది. ఇటువంటి వాటి గురించి ప్రచారం జరగదు. పాట రాసిన రచయిత గురించి అంతగా తెలియదు. పాడినవారు గొంతు తీయదనం గురించి చెబుతారు. సన్మానాల్లో పదనిసలు భానుమతి గారి గురించి వేరే చెప్పాలా. ఆమె మాట్లాడితే ఛలోక్తులతోనే చెమట పట్టించగలదు. ఆమె పాట వింటే చెప్పలేని తన్మయత్వం కలుగుతుంది. ఆమె రూపం, గానం, నటన అంతా ప్రత్యేకమైనవి. 'మనలో మాట' బాబాల బండారం ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని అవతారమెత్తుతున్నారు. ఈ మధ్య చదువుకున్నవారే బాబాల వెంటపడుతున్నారు. ప్రధాని లాంటి వారే బాబాలను ప్రోత్సహిస్తుంటే ప్రజలు ఎందుకు నమ్మరు.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, పూజారి పేట, ఆముదాల వలస

బాబాల బండారం

బాబాల బండారం సంపాదకీయం చాలా బాగుంది. ఎంతో వైజ్ఞానికంగా సమాజం ముందుకు పోతున్నప్పటికి మూఢ నమ్మకాలతో బాబాలు, మతాల మీద భక్తి పెరుగుతుంది. బాబాలను అడ్డం పెట్టుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ప్రజా పతినిధులు చేస్తున్నారు. కార్పొరేట్ మార్కెట్ శక్తులు బాబాలను ప్రోత్సహిస్తున్నాయి. రాజధాని సమీపంలో జగ్గీవాస్ దేవ్ బాబాకు 400 ఎకరాలు, విజయవాడకు దగ్గరలో 20 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. పేదవాడు ఇంటికి 60 గజాలు కేటాయించమంటే మాత్రం అరెస్టులు చేస్తున్నారు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ

ఆరాధ్య దైవం రావణుడు

మనదేశంలో మత విశ్వాసాలు మనిషిని ఎంతగానో ప్రభావితం చేస్తాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క దేవుడిని పూజిస్తారు. అలాగే శ్రీలంకలో రావణుడిని కొలుస్తారు. మనం అయితే రాముడిని కొలుస్తాం. అంతే తేడా ఏ దేవుడిని పూజించినా అది వారి నమ్మకం, విశ్వాసాలపైన ఆధారపడి ఉంటుంది.

సుధాకర్, ఖాజీపేట

కలర్ పేజీలు బాగున్నాయి

స్నేహ సంచికలో వచ్చే కలర్ పేజీలు బాగున్నాయి. ప్రతి అంశాన్ని భిన్నంగా, సమాజానికి ఉపయోగపడేలా ఇస్తారు. పోల్ కపుల్ సుజి క్యూ, టోబీ జె భార్యభర్తలిద్దరూ కలిసి నృత్యం చేస్తే మైమరిచిపోని వారెవరుండరేమో!. అలాగే ఒంటరి నిర్మాణం చేపట్టడం అసాధ్యం. అలాంటిది జస్టో గల్లెగో మార్టినె జాలో ఒక్కడే ఇలాంటి నిర్మాణాలు పూర్తి చేయడం నిజంగా అద్భుతమే !

-జగదీశ్, కర్నూలు (ఈ-మెయిల్)

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020.

మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

రుతు రాగాలు

కవర్‌స్టోరీ 14

రోళ్లు పగల కొట్టే రోహిణి కార్తె తరువాత తొలకరి పలకరింపుతో పుడమి తల్లి పులకరించిపోతుంది. నీలి మేఘాల ఆకాశం కారుమబ్బుల కొత్త రంగును పులుముకుంటుంది. ఆ మబ్బులను తొలుచుకుంటూ నేలమీదకు జాలువారే ప్రతి నీటి బొట్టూ ఒకొక్క అమృత బిందువవుతుంది. బీడువారి, బీటలు వారిన భూములు కొత్త సొగసులు అద్దుకుంటాయి. చిటపట చినుకులతో తడిసిన మట్టి గమ్మత్తుగా సువాసనలను వెదజల్లుతుంది. కర్షక వీరులు కర్మ జలాలను చిందించడానికి నూతనోత్సాహంతో సిద్ధమవుతారు. వానా వానా వల్లప్పా ...అంటూ చిన్నారులు చిరుజల్లులకు స్వాగతం పలుకుతారు. రుతుపవానాలు తీసుకువచ్చే తొలకరి జల్లుల చుట్టూ అల్లుకున్న అనుబంధాలివి!



ప్రత్యేకం 3
డాల్ఫిన్లతో గేలమేసెయ్

నవ్వుల్-పువ్వుల్ 4

వింతలోకం 5
జ్ఞాపక చిత్రరాజు

చూద్దామా 6
అందాల ఆస్ట్రేలియా

స్ఫూర్తి 8
వెలుగు రేడు

రుచి 9
శీలావతి చేపల పులుసు

సినిమా కబుర్లు 10
ఎన్.టి.ఆర్ - ఓ అధ్యయన గ్రంథం

కథ 18
ఎడ్ల బండి

బాలనేస్తాలు 22
నోమ్ తోటమాలి

కొత్త పుస్తకాలు 24
మహారచయిత మనో వీధులు

....

అండమాన్‌లో అవతార్ 12

డాల్ఫిన్లతో గేలమే సేఫ్

డాల్ఫిన్‌తో దోస్తీ కట్టేయ్... ఇట్టే చేపలు పట్టేయ్. మనుషులకు డాల్ఫిన్స్‌కు ఏదో అతీతమైన సంబంధం. మనతో చెలిమి చేసేందుకు తెగ ఇష్టపడతాయి. చొరవగా పడవల వెంట వస్తూ తమ విన్యాసాలతో మనల్ని కైపులోకి దించుతాయి. డాల్ఫిన్స్ దోస్తీని చూడాలంటే బ్రెజిల్‌లోని లగునా ప్రాంతానికి వెళ్లాల్సిందే. అక్కడి స్థానిక బెస్తవారికి చేపల వేటలో సాయం చేస్తూ స్నేహం చేస్తున్న డాల్ఫిన్ల గురించి వినాల్సిందే.

రెండు పట్టణాల ప్రాంతమైన లగునాలోని టెసౌరా బీచ్ అట్లాంటిక్ మహా సముద్రంలోకి పొడుచుకు వచ్చినట్టుగా ఉంటుంది. అక్కడే ఈ ఇద్దరు మిత్రుల సందోహం కనబడుతుంది. అక్కడ 200కు పైగానే డాల్ఫిన్లున్నా అన్ని ఇలా చేపలు పట్టేవారికి సాయం చేయవు. కేవలం 21 బాటిల్ నోస్ డాల్ఫిన్లు మాత్రమే ఇలా సాయం చేసేవి ఉన్నాయి. వాటి తోకల మీద ఉండే గుర్తులు, వేటికవే చేసే భిన్న ధ్వనుల ద్వారా వాటిని గుర్తుపడతారు. వాటికి కరోబా, ఫిలిఫే, స్కూబీ అని పేర్లు కూడా పెట్టేశారు. ముల్లెట్ రకం చేపలను వలల్లోకి తరుముతాయి. అలా వలల్లో చిక్కగా మిగిలినవి వెనుతిరిగే సమయంలో ఒడుపుగా వేటాడతాయి. చేపల పట్టేవారు ప్రత్యేకంగా వీటికి ఆహారం వేయాల్సిన అవసరంలేదు. అసలవి పెంపుడు డాల్ఫిన్లు కావు. ఎవరూ శిక్షణ కూడా ఇవ్వలేదు. కానీ, టెసౌరా బీచ్ సముద్ర జలాల్లోని తీవ్రత, అపారదర్శకత వంటి అడ్డంకులే ఈ తరహా వేటకు కారణమని పరిశోధకులు అంటున్నారు. డాల్ఫిన్లకు ఉన్న బయోసోనార్ వ్యవస్థ ద్వారా ధ్వనుల ఎకోల ద్వారా అవి ఈతను, వేటను నియంత్రిస్తుంటాయి. సుమారు రెండు వందల ఏళ్లకు ముందు నుంచే ఈ తరహా వేట ఇటు స్థానికులకు, అటు డాల్ఫిన్లకు అలవాటైందని19వ శతాబ్దపు ఓ లేఖ ద్వారా బయటపడింది. తరం మారుతున్న కొద్దీ ఇంకా స్నేహంగా ఇంకా అర్థవంతంగా ఈ చేపల వేట కొనసాగుతోంది. పిల్ల డాల్ఫిన్లను వెంటబెట్టుకుని ముల్లెట్లను ఎలా వలల వెంట తరమాలో తల్లి డాల్ఫిన్లు నేర్పిస్తే, వాటి సంజ్ఞలు, రూపాల్ని పిల్లలకు తెలియజేస్తున్నారు స్థానికులు. ఈ సంప్రదాయం అలా ఒక తరం నుంచి ఇంకో తరానికి చేరుతోంది. వీరి వలలు కూడా చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ఈజిప్టు సమాధుల్లో, కొత్త నిబంధన పుస్తకాల్లోని తరహావి ఇవి. వీటిని వలసవచ్చిన అజోర్‌లు స్థానికులకు అందించారు.

అయితే డాల్ఫిన్లు ఒక సమయం అంటూ పాటించవు. అవి కనిపించే దాకా వలలు పట్టుకుని బీచ్‌లో గడపాల్సిందే. అవి లేకుండా వేట కుదరదు మరి. ఎక్కడి నుంచి తరుముకొస్తాయో గానీ, చాలా ప్రత్యేకమైన ఈతతో అవి దూరం నుంచే హెచ్చరికల్ని పంపుతాయి. ఒక్క అంగుళం మాత్రం చూసినా స్థానికులు వాటిని చటుక్కున గుర్తుపట్టేస్తారు. అమోఘమైన తెలివితేటలుండే ఈ డాల్ఫిన్లు సుమారు 200 మంది బెస్తవారి వలల్ని నింపుతున్నాయి. వీటిలాగే ఆస్ట్రేలియా, మారిటేనియా, బర్మా సముద్ర ప్రాంతాల్లో మరికొన్ని రకాల డాల్ఫిన్లు మనుషులకు చేపలో వేటలో సాయం చేస్తున్నాయి.

ఇక్కడి డాల్ఫిన్లు మరీ ఫ్రెండ్లీ. ఓ సారి విశాల సముద్రంలోంచి ఇక్కడి చీలికలోకి తప్పివచ్చిన ఓ తిమింగలం, దాని పిల్ల బయట పడలేకపోయాయి. ఒడ్డుకు కొట్టుకువస్తే ఇక వాటికి ప్రమాదమే. వీటి అవస్థను చూసిన డాల్ఫిన్లు వాటికి తోడుగా వెళ్లి బాహ్య సముద్రంలోకి వదిలి వచ్చాయి. ఇంతటి స్నేహపూర్వకమైన డాల్ఫిన్లను, ప్రపంచంలో చాలా చోట్ల చేపల వేటకు వెళ్లేవారు శత్రువులుగా, పోటీదారులుగా, దొంగలుగా చూసి చంపేస్తుంటారు. దాని కోసం తుపాకీలను ఉపయోగిస్తు న్నారు. అందువల్ల మామూలు నౌక దగ్గరకు రావాలన్నా అవి భయపడుతున్నాయి. ఇదివరకు అవే ప్రాంతాల్లో ఓడ చుట్టూ రకరకాల విన్యాసాలు చేస్తూ అలరించేవి.

కేవలం చేపల వేటలోనే కాదు, డాల్ఫిన్లు యుద్ధరంగం, పరిశోధన రంగంలోను తమ విలువైన సేవల్ని అందిస్తున్నాయి. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో వీటికి వార్‌హెడ్స్ కట్టి శత్రు జలాంతర్గాములు, యుద్ధ నౌకల వైపు పంపేవారు. ఇది పైశాచికత్వమని జీవకారుణ్య సంస్థలు గొడవచేయడంతో సైన్యాలు వెనక్కుతగ్గాయి. ఆ తర్వాత వీటిని సముద్ర గర్భంలోని పేలుడు పదార్థాలు, నిధులు, నౌక అవశేషాల వంటి వాటిని గుర్తించేందుకు వినియోగిస్తున్నారు. అమెరికా సైన్యం డాల్ఫిన్లతో మాట్లాడేందుకు భాషను కూడా రూపొందించింది. హవాయి భాషను డాల్ఫిన్లు తేలిగ్గా అర్థం చేసుకోగలవని గుర్తించింది. అందుకే డాల్ఫిన్లు మనకు అంత దగ్గర.

✦

నవ్వుల్ – పువ్వుల్



ప్లానింగ్

అప్పారావు: (ఆఫీసర్‌తో) ఈమె నా భార్య సార్ ..మంచి ప్లానింగ్ ఉంది. ఇవాల్టి పనిని నిన్ననే చేస్తుంది.

సుబ్బారావు: (ఆఫీసర్) వెరీగుడ్.... భోజనం చాలా బాగుందమ్మా.

అప్పారావు: వంట కూడా అంతే సార్. ఇవాళ మిమ్మల్ని పిలిచానని చెప్పగానే నిన్నే చేసేసింది!

సుబ్బారావు: ఆ!!!

అసలు విషయం

(ఎమ్.ఎమ్.టి.సిలో ఒక ముసలావిడ రోజు ఒక కాలేజ్ కుర్రాడికి రోజు 4–5 డ్రై ఫ్రూట్స్ ఇస్తూ ఉంటుంది. ఆ కుర్రాడు వాటిని తీసుకునే వాడు)

ఒక రోజు కుర్రాడికి బాగా ఉత్సుకత పెరిగి రోజు ఇలా డ్రై ఫ్రూట్స్ ఎందుకిస్తున్నావని ఆ ముసలావిడని అడిగాడు.

అందుకావిడ కొంచెం ఎమోషనల్‌గా మొహం పెట్టి

నాకు క్యాడ్‌బెర్రి డ్రై ఫ్రూట్స్ అంటే బాగా ఇష్టం కానీ వాటిని నమలాలంటే నాకు పళ్ళన్నీ ఊడిపోయాయి.

చాక్లెట్ చీకేసి నీకు డ్రై ఫ్రూట్స్ ఇస్తాను అంటు చల్లగా అసలు విషయం చెప్పింది.

మందుబాబులు

ఇద్దరు స్నేహితులు బాగా మందు కొట్టి కార్లో తిరిగి వెళ్తున్నారు. కారు దూసుకుపోతుంది. శశాంక్ అరవడం మొదలు పెట్టాడు. చూడు స్తంభం ...ముందు చూసుకో స్తంభం.. జాగ్రత్త రేయ్..బండి తిప్పు..తిప్పరా! అని అరిచాడు. అయినా కారు స్తంభానికి గుద్దుకుంది. శశాంక్ ఆసుపత్రి పాలయ్యాడు. తెల్లారి స్నేహితుడు శశాంక్‌ను పలకరించడానికి వచ్చాడు.

'నేను చెబుతూనే ఉన్నానా కారు తిప్పమని' అంటూ కోప్పడ్డాడు శశాంక్.

'నేనెలా తిప్పనురా నువ్వు డ్రైవ్ చేస్తుంటే' అన్నాడు ఆ మిత్రుడు.

సియం

ఒక కామన్‌మేన్ చేపను పట్టి తెచ్చి భార్యకిచ్చి వండమంటాడు.

భార్య: గ్యాస్ లేదు, కిరోసిన్ లేదు, కరెంటు లేదు, నూనె లేదు ఎలా వండేది?

కామన్‌మేన్ చేపను తీసుకెళ్లి మళ్ళీ చెరువులోనే చేపలు వదిలేస్తాడు.

చేప ఒడ్డుకొచ్చి... గట్టిగా సియం (కామన్ మేన్)కిజై! సియం కి జై! అరుస్తుంది

స్నేహితుడు

పున్నారావు తీవ్ర అనారోగ్యంతో హాస్పిటల్‌లో ఉన్నాడు. బంధువులంతా చుట్టూ చేరారు. పక్కనే ఉన్న స్నేహితుడికి సైగ చేసి ఒక పెన్నూ పేపర్ తెమ్మన్నాడు. సరే ఏదో చివరి కోరిక నోటితో చెప్పలేక రాసి చూపిస్తాడని తెచ్చి ఇచ్చారు. అతి కష్టం మీద రెండు వాక్యాలు రాసి ప్రాణాలు విడిచాడు పున్నారావు.

సరే చనిపోయిన వెంటనే దాన్ని చదవడం ఎందుకని జేబులో పెట్టుకున్నాడు. దహన కార్యక్రమాలు అయిపోయిన తర్వాత ఆయన ఇంటికొచ్చి అందులో ఏం రాశాడో చదవాలని మడత విప్పి చదివాడు అందులో

"నా తల దగ్గర కూర్చున్నాయన నా ఆక్సిజన్ ట్యూబ్ మీద కూర్చున్నాడు, నాకు ఊపిరి ఆడటం లేదు" అని వుంది.

అర్ధ రూపాయి

భిక్షగాడు: గుడ్డివాణ్ణి ఓ అర్ధరూపాయి దానం చేయండి బాబయ్య.

వ్యక్తి: నువ్వు గుడ్డివాడివేంటి? నీకు ఒక కన్ను బాగానే ఉందే?

భిక్షగాడు: అయితే పావలా ధర్మం చేయండి బాబ.

ప్రేమ శిల

ప్రేమలో పడిపోయాడు. ప్రేమలో తప్పిపోయాడు. ప్రేమలో శిలైపోయాడు. తైవాన్‌కు చెందిన ప్రేమ పిపాసి అహ్ జి ప్రియురాలి ఎడబాటులో మోడైపోతున్నాడు. ఇరవై ఏళ్లుగా టైనన్ రైల్వేస్టేషన్‌లో ప్రియురాలి రాక కోసం ఎదురు చూస్తున్నాడు. అక్కడే కలుసుకుంటానని బాస చేసిన చెలికి ఏమైందో తెలీదు. ఆమె గురించి పూర్తి వివరాలు తెలీవు. ఒక్క మాటతో ప్రేమ ఖైదీని చేసి మాయమైంది. స్టేషన్ ద్వారం వద్ద శిలలా కూర్చుని కదిలిపోతున్న వందలాది ముఖాల్లో ఆమె మోమును ఆతృతతో వెతుకుతున్నాడు. కలుద్దామని చెప్పిన రోజు సంతోషంగా అక్కడకు చేరుకున్నాడు.

ఎంత సేపైనా ఆమె జాడ లేదు. అలా అక్కడే నించుని నిరీక్షిస్తూ వాడిపోతున్న పూలరెక్కల్ని తన కన్నీటి ధారలతో తడుపుతూ ఆమె కనిపిస్తుందనే ఆశను తాజాగా మనసులో బతికించుకున్నాడు. అలా రోజులు కదిలిపోయాయి. ఏళ్లు దొర్లిపోయాయి. ఇతడి కథ తెలుసుకున్న కొందరు రైలు సిబ్బంది, సామాజిక కార్యకర్తలే సమయానికి భోజనాన్ని అందిస్తారు. కుటుంబ సభ్యులు అప్పుడప్పుడు వచ్చి దుస్తులు తెస్తారు. ఎంత బతిమాలినా ఇంటికి వెళ్లలేదు. మూడేళ్ల క్రితం సామాజిక కార్యకర్తలు అతడికి షెల్టర్ ఏర్పాటు చేసినా వెళ్లలేదు. అక్కడి నుంచి కదిలేది లేదంటూ తనను వదిలేయాలని కన్నీరు పెట్టుకున్నాడు. తన చెలి లేని జీవితం శల్యమైపోని అంటూ అక్కడే కూలబడ్డాడు. చివరకు అధికారులు స్పందించి ఆయన్ను ఆస్పత్రికి తరలించినా తప్పించుకుని అక్కడకే చేరుకున్నాడు. అతడు మారాలని ప్రభుత్వ సాంఘిక శాఖ ఓ చర్చి విందు అక్కడే ఏర్పాటు చేసి అతడి కుటుంబాన్ని, బంధువుల్ని, మిత్రుల్ని చేరువ చేసి ంది. అయినా లాభం లేదు. తైవాన్, సింగపూర్, చైనాల్లో ఆయన కథ నలువైపులా చేరినా ఆమె మాత్రం ఆ స్టేషన్ దగ్గర బండి దిగలేదు. అతడి కథ మలుపు తిరగలేదు.

ప్రేయసి రావే..
ఊర్వశి రావే..

వింతలోకం

పది ఇళ్లు కూడా లేని గ్రామమా అయితే కరెంట్ కష్టమే.నాలుగే ఇళ్లకు దారెలా వేస్తాం. అని కుగ్రామాల్ని పట్టించుకోరు గానీ, అలస్కాలోని మారుమూల గ్రామం విట్టీయర్‌లో ఒకే భవంతిలో ఉన్న ఆ గ్రామంలో అన్ని సదుపాయాలున్నాయి.మార్కెట్, పోలీస్ స్టేషన్, చర్చి, జనరల్ స్టోర్, హాస్పిటల్, పోస్ట్ ఆఫీస్, పాఠశాల ఇలా అన్ని రకాల వసతులు ఉన్నాయి. పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. గ్రామం మొత్తం ఒక కప్పు కిందే హాయిగా వేడి కాచుకుంటుంది. అత్యంత చల్లని ప్రదేశమైన అక్కడకు వెళ్లాలంటే ఓ

ఒకే కప్పు కింద ఊరంతా...

సన్నని సొరంగం లోపలి నుంచి చేరుకోవాలి. అది తప్ప వేరే మార్గం లేదు. జాతీయ రహదారికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఉన్నా అక్కడకు వెళ్లడం పెద్ద ప్రయాస. రాత్రి పది గంటల కల్లా ఆ దారిని మూసేస్తే ఉదయం ఏడింటింటికి గానీ తెరవరు. మొత్తం 220 మంది గ్రామస్తులు ఆ పెద్ద భవంతిలో చక్కగా కలిసి మెలిసి జీవిస్తున్నారు. ఎవరి ఫ్లాట్‌లు వాళ్లవేలెండి. అంతమందికి చోటిచ్చిన ఈ భవంతిని 1952లో ప్రచ్ఛన్న యుద్ధం సమయంలో సైనికుల బరాక్‌ల కోసం కట్టారు. దీని పేరు బెగిచ్ టవర్.

డచ్ ఆర్టిస్ట్ స్టెఫాన్ బ్లీక్‌రోడ్ ఎదురుగా అందమైన స్త్రీని చూస్తూ ఆమె పోర్ట్రెయిట్‌లు గీయడు. అందమైన లొకేషన్లకు సరంజామా సర్దేసి ల్యాండ్‌స్కేపుల్ని దించేయడు. రంగుల్ని చిలకరించి ఇంద్ర ధనుస్సుల్ని ఆవిష్కరించడు. కానీ ఓ ప్రత్యేకత ఉంది. ఊరంతా ఓ రౌండ్ కొట్టి ఎత్తైన కట్టడాల పైకి ఎక్కి ఊరి తీరును బుర్రలో భద్రపరుస్తాడు. ఓ ఇంక్ పెన్ను తీసుకుని చకాచకా ముద్ర వేసేస్తాడు. తీరా చిత్రం పూర్తయిన తర్వాత చూస్తే హెలికాప్టర్‌లోంచి ఫొటో తీసిన బ్లాక్ అండ్ వైట్ చిత్రంగా అనిపిస్తుంది. బుర్రలో ఉన్న ఊరి కాపీని ఇలా అచ్చు గుద్దే పని పదేళ్ల నుంచే మొదలెట్టేశాడు. ఇప్పుడతనికి 28 ఏళ్లు. ఈ మధ్యలో అనేక

జ్ఞాపక చిత్రరాజు

వ్యూపాయింట్ల నుంచి మనోడు లండన్, న్యూయార్క్, పారిస్‌లలోని సిటీ స్కేప్‌లను కాగితం మీదకు తర్జుమా చేసేశాడు. చెట్టు, స్తంభం, ఊడిపోయిన లైట్, కిటికీల క్రమాన్ని బాగా నిశితంగా పరిశీలించి ఈ బొమ్మలు వేస్తున్న ఇతగాడి జ్ఞాపక శక్తిని చూసి గొప్ప గొప్ప మేధావులే ఆశ్చర్యపోతున్నారట. ఇంత పక్కాగా అంత పెద్ద ప్రాంతాన్ని అణువణువూ గుర్తుంచుకోవడం దాన్ని తిరిగి చిత్రాల రూపంలోకి మార్చడం సామాన్య విషయం కాదంటున్నారు.ఫొటోలు తీసేటపుడు స్నాప్‌షాట్లను ఎలా తీస్తారో అలా ముక్కలు ముక్కలుగా తను చూసిన ప్రాంతాల్ని గుర్తుంచుకుంటాడట. పదేళ్ల వయసులో ఉన్నపుడు ఇంప్రెషనిస్టిక్ కళలో తర్ఫీదు పొంది బెల్జియం, ఫ్రాన్స్‌ల్లోని ప్రాంతాల్ని చిత్రాలుగా మలిచేవాడు. చిన్న ప్రాంతాల్ని 5 రోజుల్లో వేసేస్తూ, విశాలమైన ప్రాంతాల్ని గీసేందుకు ఆరు నెలల సమయం తీసుకుంటాడు. 'హ్యూమన్ కెమెరా'గా గుర్తింపు పొందిన ఆటిజమ్ బాధితుడు స్టీఫెన్ విల్ట్‌షైర్ ఇదే కళలో బాగా ఆరితేరినవాడు. అతడే స్ఫూర్తేమో.

అందాల ఆస్ట్రేలియా

గత ఐదేళ్లలో నేను ఆస్ట్రేలియాను సందర్శించటం ఇది మూడవ సారి. ఆస్ట్రేలియా ద్వీపం అనేక దీవులు దీనిలో భాగం. చుట్టూ సముద్రాలతో ప్రకృతి రమణీయతతో అలరారే అందమైన దేశమిది.

అడిగోపుల వెంకటరత్నమ్

ఫోటోలు: శ్రీకాంత్

ఈ సారి నా మొట్టమొదటి మకాం బ్రిస్బేన్ బేన్ నగరం. ఇది క్వీన్స్‌ల్యాండు రాష్ట్రంలో వుంది. ముఖ్య పట్టణం కూడ. బ్రిస్బేన్ నది నగరంలో నాలుగు యు టర్న్‌లు తిరుగుతుంది. దాదాపు నగరమంతా బ్రిస్బేన్ నది చుట్టుతుంది. ఈ నది వల్లనే ఆ నగరానికి ఆ పేరు వచ్చింది. ఇక్కడి జనాభా 23 లక్షలు.1825 లో ఏర్పాటైంది. 2018 కామన్ వెల్త్ గేమ్స్ ఇక్కడ జరగబోతున్నాయి.

చూడాల్సిన స్థలాల్లో మౌంట్‌కూట్ ఒకటి. ఇది 1500 ఎకరాల కొండ. ప్రకృతి శోభతో వెలిగిపోతూ ఉంది. దీన్ని "ఒక చెట్టు కొండ" అంటారు. కొండ శిఖరాగ్రంపై వెలసిన గజీబోలో నిలబడి బ్రిస్బేన్ నగరం బ్రిస్బేన్ నదిని చూడవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఇది అమెరికా సైనిక స్థావరం అప్పుడు ఇక్కడ రెండు లక్షల ఇరవై వేల టన్నుల మందుగుండు సామగ్రి నిలువ చేయబడింది. అసలే ప్రకృతి మయం. ఆ పైన ఎత్తైన కొండ చూపు పండుగ చేసుకుంటుంది.

బ్రిస్బేన్‌లో ఎలక్ట్రిక్ స్తంభాలన్నీ పైన్ చెట్లే. అవి కాంక్రీటు స్తంభాల్లా నునుపుగా గుండ్రంగా చక్కగా దాదాపు యాభై అడుగుల ఎత్తున ఉంటాయి. వాటిని ఏర్పాటు చేయడానికి కాంక్రీటు స్తంభాల కంటే ఖర్చు తక్కువ అవుతుంది. నాణ్యత మెరుగ్గా వుంటుంది. ఇప్పుడు బ్రెజిల్ , సౌత్ ఆఫ్రికా దేశాల్లో వీటిని వాడుతున్నారు.

చాలా రోడ్ల ఎడమవైపు కుడివైపు ఎత్తుగా ఉండి.... వర్షపు నీరు మధ్యలోకి పారి గ్రేటింగుల ద్వారా కిందకు జారుతుంది. మామిడి కాయల పంట ఎక్కువగానే ఉంది. డిసెంబరు నెలాఖరుకు పూర్తవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో దొరికే అన్ని వస్తువులు కూరగాయలు అక్కడ దాదాపుగా లభిస్తాయి. సాంబారు పొడి, రసం పొడి, కరివేపాకు, చెప్పనవసరం లేదు. కోడిగ్రుడ్లు తెలుపు, గోధుమ, గులాబి రంగుల్లో వుంటాయి. ఆపిల్స్, టమోటాలు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు మూడు నాలుగు రంగుల్లో దొరుకుతాయి. దక్షిణ భారత వంటకాలు ఇప్పుడిప్పుడే ఆస్ట్రేలియాలో చోటు చేసుకుంటున్నాయి. కారం ఎక్కువగా వాడటానికి ఉత్సుకత చూపుతున్నారు.

డెబ్బయి శాతం ప్రజలు కార్లు ఉపయోగిస్తుంటే సైకిళ్ళను కొంత మంది వాడుతున్నారు. ప్రతి రహదారిలో సైకిలు కోసం రోడ్డు కేటాయించబడింది. వ్యాయామం కోసం, వాహ్యాళి కోసం, ప్రయాణం కోసం సైకిలు వాడుకలో ఉంది. అద్దె సైకిలు స్టాండ్లు నగరమంతా విస్తరించి ఉన్నాయి. ఒక చోట తీసుకున్న సైకిలు వాడుక అయ్యాక ఎక్కడ స్టాండు ఉంటే అక్కడ పెట్టవచ్చు. మొదట తీసుకున్న స్టాండు దగ్గరకే వెళ్ళాల్సిన పని లేదు. సైకిలు స్టాండు చూడ ముచ్చటగా ఉంటుంది.

ఇక్కడి గోల్డు కోస్టు బీచ్ ప్రపంచంలో అతి పెద్దది. దీని పొడవు 573 కిలోమీటర్లు. నగరానికి 42 కిలోమీటర్ల దూరంలో ఉంది. మొట్టమొదట 1920లో సర్ఫర్స్ ప్యారడైజ్ హోటలు ప్రారంభించబడింది. ఆనాటి నుండి దినదినాభివృద్ధి చెంది నేడు పదమూడు వేల అతిథి గృహాలు వెలసి 500 హోటళ్ళు ఉన్నాయంటే ఆశ్చర్యమే మరి. ఉదాహరణకు q1 హోటలు ఎత్తు 1050 అడుగులు. భవనాలన్నీ గోల్డు కోస్టు ఒడ్డున సముద్రానికి అభిముఖంగా నిలిచి ఉంటాయి.

ప్రపంచం నలుమూలల నుండి ఇక్కడకు సంవత్సరానికి కోటి మంది పర్యాటకులు విచ్చేస్తుంటారు. ఎక్కువగా చైనా, జపాన్, ఇంగ్లాండు, అమెరికా, కొరియా, వియత్నాం, తైవాన్, థాయ్‌ల్యాండ్ , సింగపూర్‌ల నుండి ఈ మధ్య భారతదేశం నుండి వచ్చే పర్యాటకులు గణనీయంగా పెరిగారు. ఇక్కడ సర్ఫింగ్, షిప్పింగ్, సైక్లింగ్, బోటింగు, గోల్ఫ్ ఆటలు ముఖ్యం. సముద్ర స్నానం చేసి బీచ్‌లో సన్

బాత్ చేసేవాళ్లు ఎక్కువ. కొంత మంది పడవల్లో లోనికెళ్లి ఫిషింగ్ చేస్తారు. మరికొందరు పారాచ్యూట్ ఆటతో ఆనందిస్తుంటారు.

ఓపిక ఉన్నంత వరకు ఒడ్డున నడవవచ్చు. విశ్రాంతిగా కూర్చోవచ్చు. సముద్ర విన్యాసాల్ని చూస్తూ రోజంతా గడపవచ్చు. ఈ సందర్భంగా చలంగారి మాటలు గుర్తొస్తాయి.

చలంగారు బీమిలి బీచ్‌లో కూర్చొని సముద్రాన్ని చూస్తొంటాడు. అక్కడకు వచ్చిన మిత్రుడితో 'సాయంత్రం సముద్రాన్ని చూస్తున్నాను. ఉదయం వచ్చాను' అంటాడు చలంగారు. 'ఉదయం నుంచి చూస్తున్నావా' అని మిత్రుడు ఆశ్చర్యపోతే' అవును ఉదయం నుంచి చూస్తున్నానని చలంగారు చెప్తారు.

బీచ్ కార్యకలాపాల్ని ఎత్తైన భవనం నుండి వీక్షిస్తున్న రెస్క్యూ టీమ్ వీక్షిస్తుంది. ఏదైనా అపాయం జరిగితే వెంటనే లైఫ్ గార్డ్స్‌ని పంపుతుంది.

సూటు బూటు ధరించి మెటల్ డిటెక్టర్లు చేబట్టి విలువైన వస్తువులు దొరుకుతాయని కొందరు బీచ్ ఇసుకలో వెతకటం కనిపించింది. ఓ మహిళకు లక్షల విలువ గల బంగారం దొరికిందని ఆ తర్వాత నాకు తెలిసింది.

అన్ని రుతువుల్లో చల్లని గాలితో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. బీచ్ పరిసర ప్రాంతాల్లో షార్క్ చేపల కదలికలు గమనించి వాటి బారిన పడకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. భూతల స్వర్గం ఎక్కడో లేదనిపిస్తుంది.

✦



కొన్ని అంకెలు...వివరాలు...

ఆస్ట్రేలియా ముఖ్య పట్టణం కేన్‌బరా. దేశ జనాభా 2.39 కోట్లు. ఇది ప్రపంచంలో ఆరవ విశాలమైన దేశం. ప్రస్తుతం జాతీయ భాష ఇంగ్లీషు. అధికారిక భాష ఏదీ లేదు. 18వ శతాబ్దంలో ఆంగ్లేయులు ఇక్కడకు రాక ముందు స్థానికులు 250 భాషలు మాట్లాడేవారు. అధిక సంఖ్యాకులు అంటే రోమన్ క్యాథలిక్స్ 25 శాతం. బౌద్ధులు 2.5 శాతం. హిందువులు 1.3 శాతం. ఏ మతానికి చెందని వారు 22.3 శాతం ఉన్నారు. బుద్ధుడు, వినాయకుడు ప్రతిమలు ఎక్కువగా కనిపిస్తాయి. గవర్నమెంటు యూనివర్శిటీలు 37, ప్రైవేటువి 2 ఉన్నాయి.

ఆస్ట్రేలియాలో ఆరు రాష్ట్రాలున్నాయి. క్వీన్స్ ల్యాండ్, సౌత్ ఆస్ట్రేలియా, టాస్మేనియా, విక్టోరియా, వెస్ట్రన్ ఆస్ట్రేలియా, న్యూ సౌత్ వేల్సు.

ఈ దేశానికి రాణి ఎలిజబెత్2. ఇంగ్లాండులో ఉంటుంది. వారి తరుపున ఇక్కడ గవర్నర్ జనరల్ ఉంటాడు. ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రధాన మంత్రి, మంత్రులు వుంటారు. రాణి పదవి అలంకారప్రాయమే.

ఆస్ట్రేలియాలో ముఖ్య నగరాలు సిడ్నీ, మెల్‌బోర్న్, బ్రిస్‌బేన్, అడిలైడ్, పెర్త్ అన్నింటికంటే సిడ్నీ నగరం పెద్దది.

చర్చి దొంగతనం

చర్చి ఏమిటీ? దొంగిలించడమేమిటీ? అని విచిత్రంగా వుంది కదూ. కానీ ఇది నిజం. కెనడాలో 1897లో ఈ సంఘటన జరిగింది. దాని పూర్వాపరాలు చూద్దాం. పశ్చిమ కెనడాలో ఒకప్పుడు డొనాల్డ్ అనే ఒక సెటిల్‌మెంట్ వుండేది. కెనడా పసిఫిక్ రైల్వేకు అది ప్రధాన కేంద్రం. డొనాల్డ్‌లో నివశిస్తున్న వారంతా రైల్వేలో పని చేసే వారే. 1897లో కెనడా పసిఫిక్ రైల్వే తన ప్రధాన కేంద్రాన్ని 180 కిలోమీటర్ల దూరంలో వున్న మరో పట్టణానికి మార్చాలని నిర్ణయించింది. దీంతో డొనాల్డ్ ప్రజలంతా దగ్గరలో వున్న విండ్‌మియర్ పట్టణానికి తరలిపోయారు. ఇదిలా వుండగా డొనాల్డ్‌లో తను గతంలో నిర్మించిన చర్చిని కూడా తరలించాలని నిశ్చయించింది రైల్వే శాఖ. అయితే విండ్‌మియర్‌లోని డొనాల్డ్ వాసులకు అది నచ్చలేదు. చర్చి తమతో పాటే వుండాలనుకున్నారు. దీంతో వారు డొనాల్డ్ గ్రామానికి వెళ్లి చర్చిని భాగాలుగా పూడదీసి పట్టుకుపోయారు.

ఇదిలా వుండగా... మార్గమధ్యలో ఈ చర్చి గంట చోరీ అయింది. ఆ పని చేసింది మరెవరో కాదు! అక్కడికి దగ్గరలో వున్న గోల్డెన్ గ్రామ చర్చికి చాలా కాలంగా గంట లేకపోవడంతో ఇదే అదనుగా భావించి వారు గంటను ఎత్తుకుపోయారు. గోల్డెన్‌లో చర్చి ఇప్పటికీ వుంది. దీనికి 'దొంగిలించబడిన గంట యొక్క సెయింట్ పాల్ చర్చి' అని పేరు. అయితే చోరీ అయిన చర్చి ఏమైందో చూద్దాం. చర్చి విడిభాగాలను తీసుకుపోయిన డొనాల్డ్ వాసులు వాటితో విండ్‌మియర్‌లో చర్చిని నిర్మించుకున్నారు. ఆ చర్చి పేరేమిటే తెలుసా! 'దొంగిలించబడిన సెయింట్ పీటర్స్ చర్చి'. ఇదీ విచిత్రంగానే వుందా!

✦

స్ఫూర్తి

చూపులేని పొద్దు తిరుగుడు పువ్వు వెలుగును వెదుకుతూ రోజంతా తిరుగుతుంది. భవేశ్ భాటియాకూ చూపు లేదు. కానీ ఆయన మాత్రం వెలుగుల్ని తనవైపు తిప్పుకుంటున్నాడు. లోకానికి వెలుగుల్ని అమ్ముతూ మరికొందరి అంధుల జీవితాల్లో వెలుగుల్ని నింపుతున్నాడు. చూపు కోల్పోయి దారి తోచని దీన స్థితి నుంచి కోటీశ్వరుడిగా ఎదిగాడు ఈ కొవ్వొత్తుల వ్యాపారి. కమ్ముకున్న చీకట్లను స్వశక్తితో తరిమేసి వెలుగుల్ని ఆకర్షిస్తున్నాడీ వెలుగు రేడు.

వెలుగు రేడు

భవేశ్‌కు రెటీనా మస్క్యులర్ డిటెరియొరేషన్ అనే కంటి సమస్య ఉంది. చిన్నప్పుడు చూపు మందగించడం మొదలై 23 ఏళ్ల వయసు వచ్చేటప్పటికీ పూర్తిగా అంధుడైపోయాడు. తల్లి పైకి చదివే పాఠాల్ని వింటూ పీజీ వరకు పూర్తిచేశాడు. మంచి ఉద్యోగం సంపాదించి తల్లిని మహారాణిగా చూసుకుందామనే సరికి ఆమెకు కేన్సర్ అని తేలింది. ఉన్న డబ్బంతా చికిత్సకు ఖర్చయిపోయింది. తొలుత ఓ హోటల్‌కు మేనేజర్‌గా పనిచేశాడు భవేశ్. చూపు శాశ్వతంగా పోవడంతో అతణ్ని ఉద్యోగంలోంచి తీసేశారు. అతడి జీవితంలో కారు చీకట్లు అలముకున్నాయి. కొద్దిరోజుల్లోనే చికిత్సకు డబ్బులేక తల్లి మరణించింది. భవేశ్ ఒంటరివాడైపోయాడు. పేదరికం అతణ్ని వీధిన పడేసింది. భవేశ్ చిన్నప్పటి నుంచి సృజనశీలి. మట్టి బొమ్మలు, గాలి పటాలు, ఆట వస్తువులు చేయడంలో మంచి పట్టుంది. దీన్నే తన పొట్ట కూటికి ఉపయోగించాడు.

కాంతి దొరికింది

కొవ్వొత్తుల తయారీ నేర్చుకున్నాడు. ముంబైలోని నేషనల్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ సంస్థలో 1999లో ప్రాథమిక పాఠాలను తెలుసుకున్నాడు. యాభై రూపాయలకు తోపుడు బండిని అద్దెకు తీసుకుని మహాబలేశ్వర్ మార్కెట్‌లో కొవ్వొత్తుల్ని

అమ్మేవాడు. రాత్రులు కొవ్వొత్తులు తయారు చేసి పగలు అమ్మేవాడు. వంట పాత్రల్లోనే మైనాన్ని మరిగించేవాడు. ఓ సారి కొవ్వొత్తులు అమ్ముతుండగా కొందరు పోకిరీలు బండిని గిరవాటు కొట్టారు. పక్కనున్నవాళ్లు సాయం చేయకపోగా, అంధుడికి వ్యాపారం ఎందుకని హేళన చేశారు. ఓ దేవతలాంటి స్త్రీమూర్తి అండతో ఇవన్నీ దూదిపింజల్లా ఎగిరి పోయాయి. కొవ్వొత్తుల్ని కొనడానికి వచ్చిన ఓ యువతి అతడితో స్నేహం చేసింది. ఆమె పేరు నీతూ. ఆ స్నేహం ప్రేమగా మారింది. రూపాయి ఆస్తిలేని ఓ అంధుడితో పెళ్లికి ఒప్పుకోమని ఆమె తల్లిదండ్రులు తేల్చేశారు. కానీ, భవేశ్ తన తోడు లేకుండా బతకలేడని తల్లిదండ్రుల్ని కాదని వివాహ మాడింది. భవేశ్ పేదరికం ఆమె ఆశావాదాన్ని నీరు గార్చలేదు. చక్రాల కుర్చీలో భవేశ్‌ను మార్కెట్‌లో తిప్పుతూ కొవ్వొత్తుల్ని అమ్మేది. కళాత్మకమైన కొవ్వొత్తుల తయారీలో శిక్షణనిచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆమె ఓ పరిష్కారాన్ని చూపించింది. భర్తను తీసుకుని ఖరీదైన మాల్స్‌కు వెళ్లేది. అక్కడ అమ్మే భిన్నరకాలైన కొవ్వొత్తుల్ని అతడు చేత్తో తడిమి వాటి డిజైన్స్‌ను గుర్తుంచుకునేవాడు. అవి సరిగ్గా ఎలా ఉన్నాయో అలా నకళ్లు తయారు చేయగలగడంతో, తనవంటూ ప్రత్యేకమైన డిజైన్లతో కొవ్వొత్తుల్ని తయారు చేసి అమ్మేవాడు. నీతూ స్వయంగా వాటిని మార్కెట్ చేసేది. సతారా బ్యాంకు ఇచ్చిన 15 వేల రూపాయల రుణాన్ని చక్కగా వినియోగించుకున్నారు.అంచెలంచెలుగా ఎదుగుతూ మార్కెట్ పెంచుకున్నాడు. నీతూ వ్యాన్ నడపడం నేర్చుకుని వాటిని తరలించేది. అలా భర్తను వెలుగు వెంట నడిపించి సన్‌రైజ్ కంపెనీని ఆరంభించేలా చేసింది. ఇప్పుడా కంపెనీ రోజుకు సుమారు 25 వేల టన్నుల మైనాన్ని వినియోగిస్తూ 9000 రకాల కొవ్వొత్తుల్ని తయారు చేస్తోంది. సుగంధాన్ని వెదజల్లే కొవ్వొత్తుల కు తోడు రకరకాల డిజైన్లతో అబ్బురపరిచే కొవ్వొత్తు లకు అది బ్రాండ్‌గా మారిపోయింది. ఆ సంస్థలో 200 మంది అంధులు పనిచేస్తున్నారు. భవేశ్ లక్ష్యం కూడా అదే. అంధులకు శిక్షణనివ్వడం ద్వారా వారు స్వయం ఉపాధి పొందాలి. అనతి కాలంలోనే ఇంత ఎత్తుకు చేరుకోవడానికి ఆయన నమ్మిన వ్యాపార సూత్రం... హృదయంతో ఆలోచించడమే. ఎదురు దెబ్బలకు కొద వ లేకున్నా ఆయన దాన్నే నమ్మాడు, అనుసరిస్తాడు.

స్వర్ణ కాంక్ష

క్రీడల్లోనూ భవేశ్ మేటియే. జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్‌లలో అతడిది మంచి ప్రతిభ. పారాలింపిక్స్‌లో అనేక పతకాలు సాధించాడు. వివిధ పోటీల్లో సుమారు 109 పతకాలను కైవసం చేసుకున్నాడు. రాబోయే ఏడాది బ్రెజిల్‌లో జరగ బోయే పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించడమే ఆయన లక్ష్యం. దాని కోసం చాలా కష్టపడతున్నాడు. రోజూ 500 పుషప్స్, 8 కి.మీ. పరుగుతో సిద్ధమవుతున్నాడు. కారుకు తాడును కట్టి చివరన భవేశ్ పట్టుకుంటే భార్య అతడు అందుకునే వేగంతో కారును నడుపుతుంది. అలా ఆయన పరుగును ప్రాక్టీస్ చేస్తాడు. ఇరవై ఒక్క మీటర్ల ప్రపంచ రికార్డు ఎత్తుతో బ్రెజిల్‌లో నిర్మించిన కొవ్వొత్తిని తలదన్నేలా ఓ ప్రాజెక్ట్‌ను రూపకల్పన చేశాడు. అమితాబ్ బచ్చన్, సచిన్ టెండూల్కర్ వంటి 35 మంది స్ఫూర్తిదాయక వ్యక్తుల మైనపు విగ్రహాలతో ప్రదర్శనశాలను ఏర్పాటు చేశాడు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలనేది ఆయన కల. ఆయన జీవితాన్ని పరిశీలించిన వారికి అదేం పెద్ద విషయం కాదని అనిపించక మానదు. రెండు జన్మలనిచ్చిన కన్నతల్లి, ఎన్నో జీవితాలను ఇచ్చిన సహధర్మచారిణి ప్రస్తావన లేకుండా ఆయన సంభాషణ ముగియదు. ఇద్దరూ రెండు కళ్లు.

-జేఎస్పీ



చవ్వులూరించే చేపల కూర



కావలసిన పదార్థాలు

శీలావతి చేపలు-700 గ్రా, ఉల్లిపాయ ముక్కలు- ఒకటిన్నర కప్పు, పచ్చి మిర్చి- ఆరు, పసుపు-అర చెంచా, కారం- రెండున్నర చెంచాలు, ఉప్పు-తగినంత, చింతపండు- 150 గ్రా, నూనె 150 గ్రా, ఫిష్ మసాలా-రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు- కొద్దిగా.

తయారీ విధానం

ముందుగా చేపలను కల్లుప్పుతో రుద్ది శుభ్రం చేసుకోవాలి. అప్పుడే జిగురు లేకుండా ఉంటాయి. వాటికి పసుపు, ఉప్పు, కారం చెంచా చేప మసాలా పొడిని కలిపి పక్కన పెట్టుకోవాలి. పది నిమిషాల పాటు ఉంచితే ముక్కలకు ఉప్పు, కారం చక్కగా పడుతుంది. ఇప్పుడు కడాయిలో నూనె వేడిచేసి నిలువుగా చీల్చి పెట్టుకున్న పచ్చి మిర్చి ఉల్లిపాయ ముక్కలు దోరగా వేయించి బాణలితోపాటు తీసి పెట్టుకోవాలి. వేడి కొద్దిగా తగ్గాక అందులో కారం పట్టించిన చేపముక్కలును వాటిపై సర్దాలి. ఇలా చల్లారిన తర్వాత చేప ముక్కలని వేయడం వల్ల చేప వేడికి విడిపోకుండా ఉంటుంది. ఆ బాణలిలో అరగ్లాసు నీళ్లు, కరివేపాకు వేసి పొయ్యి మీద పెట్టాలి. అది మరుగుతుండగా చింతపండు రసాన్ని ముక్కలకు తగ్గట్టుగా వేసుకుని ఆ తరువాత తగినంత ఉప్పు చేర్చాలి. ముక్క బాగా ఉడికి చక్కగా వాసన వస్తుండగా అందులో మిగిలిన చేప మసాలాను వేసి దింపేయాలి. దానిపై కొద్దిగా కొత్తిమీర వేసి అలంకరించుకొంటే చేపల పులుసు సిద్ధం. వేడివేడిగా లేదా బాగా చల్లారిన తర్వాత ... ఎలా తిన్నా రుచిగానే ఉంటుంది.

శీలావతి చేపల పులుసు

వంజరం చేపల వేపుడు

కావలసిన పదార్థాలు

వంజరం చేప-అరకేజీ కన్నా కొద్దిగా తక్కువ, అల్లం వెల్లుల్లి పేస్టు-రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు-తగినంత, మిరియాల పొడి-పావు చెంచా, నిమ్మ రసం-రెండు టేబుల్ స్పూన్లు, మైదా- అర కప్పు, కోడి గుడ్లు-రెండు, బ్రెడ్ పొడి-కప్పు, నూనె- వేయించడానికి సరిపడా

తయారీ విధానం

చేపను శుభ్రంగా కడిగి పెద్ద ముక్కలు కోయాలి. వీటిని గిన్నెలోకి తీసుకుని అల్లం వెల్లుల్లి పేస్టూ తగినంత ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం వేసి బాగా కలిపి కనీసం గంట సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. కోడి గుడ్లు సొనను తీసుకుని గిలకొట్టాలి. గంట తరువాత చేప ముక్కల్ని బయటకు తీసి మైదా, గుడ్డు సొన పట్టించి, చివరగా బ్రెడ్ పొడి అద్దాలి. ఇలా చేసుకున్న వాటిని నూనెలో వేయించుకుంటే సరిపోతుంది.

చందువా చేపల కూర

కావలసిన పదార్థాలు

చందువా చేప-అరకిలో, ఉల్లిపాయలు -రెండు, అజినోమోటో-చెంచా, ఉప్పు, కారం- తగినంత, పసుపు- చెంచా, అల్లం-వెల్లుల్లి ముద్ద- యాభై గ్రాములు, నిమ్మకాయలు- రెండు, కొత్తిమీర-కట్ట, నూనె- తగినంత, కేసరి రంగు- చిటికెడు, గరం మసాలా పొడి-రెండు చెంచాలు.

తయారీ విధానం

చేపను బాగా శుభ్రం చేసి ముక్కలుగా కోయాలి. వాటికి ఉప్పు, నిమ్మరసం పట్టించాలి. గంటసేపయ్యాక బాణలిలో నూనె వేడి చేసి ముక్కల్ని వేయించి పెట్టుకోవాలి. ఉల్లిపాయల్ని మెత్తగా రుబ్బుకోవాలి. ఇప్పుడు మరో బాణలిలో ఐదు చెంచాల నూనెను వేడి చేసి ఉల్లిపాయ మిశ్రమాన్ని పచ్చి వాసన పోయే దాకా వేయించాలి. నూనె పైకి తేలాక అల్లం వెల్లుల్లి ముద్ద చేర్చాలి. రెండు నిమిషాలయ్యాక తగినంత ఉప్పు, కారం, పసుపు, అజినోమోటో, కేసరి రంగు, మసాలా పొడి కలపాలి. ఇప్పుడు కప్పు నీరు, వేయించిన చేప ముక్కల్ని చేర్చి మూత పెట్టేయాలి. చేప ముక్కలు ఉడికాక..కొత్తిమీర చల్లి దింపేస్తే చాలు. నోరూరించే చేప కూర సిద్ధం.

నందమూరి తారక రామారావు. ఎన్.టి.ఆర్. ఈపేరు వింటేనే ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగువారి ఆత్మగౌరవం ఉప్పొంగుతుంది. ప్రేరెన్నికగన్న మహానటులు సైతం ఎన్.టి. రామారావు నటించిన పాత్రల డైమన్షను చూసి...ఆ పాత్రకు ప్రాణ ప్రతిష్ట చేసే ఆయన నటనా సరళిని చూసి సంభ్రమాశ్చర్యాలతో నివ్వెరపోతుంటారు. అందుకే నటరత్న, నవరస నటనా సార్వభౌమ లాంటి బిరుదులు ఆయన మూర్తి ముందు వెలవెలలాడి పోతుంటాయి. నిజానికి ఆయన భారతరత్నం. ఈ నెల 28న ఎన్.టి.ఆర్. పుట్టిన రోజు సందర్భంగా ఆయన జీవితంలో కొన్ని విశేషాలు....

ఎన్.టి.ఆర్ ఓ అధ్యయన గ్రంథం

చెన్నై త్యాగరాయ నగర్‌లో బజుల్లా రోడ్డులో... లక్ష్మీనిలయం ఆయన నివాసం. అందరికీ ఆరు గంటలకి తెల్లవారితే లక్ష్మీ నిలయంలో మూడు గంటలకే భళ్లున తెల్లారుతుంది. "లక్ష్మీ నిలయం" ప్రాంగణం లోపల ఎన్.టి.ఆర్ పచార్లు. ఇంతలో ఒక అంబాసిడర్ కారు... ఆకారులోంచి వాహినీ వారి పహిల్వాన్.

ఈ పహిల్వాన్ కేవలం ముగ్గురికే మసాజ్ చేస్తాడు. ముందు ఎన్.టి.ఆర్.కి తరువాత త్రివిక్రమ రావుకి, ఆ తరువాత నాగిరెడ్డి గారికి. ఇంతే ఆయన డ్యూటీ. కండలు తిరిగిన శరీరం. రాజరికపుటలవాట్లను తలపింపచేసే టర్బన్. చేతిలో ములుకర్ర. చూడ్డానికి వింతగా ఉండేవాడు. చూడాలనిపించేలా వుండేవాడు. రామారావు గోచి కట్టుకొని పడుకుంటే ...గుర్రాలకు పట్టే స్కార్ఫ్ ఆయిల్‌తో మసాజ్ చేసేవాడు.పహిల్వాన్‌గారి చెయ్యి పడిందంటే ఒళ్ళంతా మువ్వలా అయిపోవాల్సిందే.తరువాత అభ్యంగన స్నానం .. ధవళ వస్త్ర ధారణ... ఎన్.టి.ఆర్. దర్బార్‌లో ఉచితాసనం అలంకరించడం. ఒక లీటరు బాదం, పిస్తా, కుంకుమ పువ్వు కలిపిన పాలూ..సేవించాక కథా చర్చలో పాల్గొనేవారు.

ఎన్.టి.ఆర్.గురించి చాలా మందికి తెలియని విశేషమైన గుణం ఉంది. ఆయన దేన్నీ పట్టించుకోనట్లు ఉంటారు గాని ప్రతి అంశాన్నీ మైక్రోస్కోపిక్ లెన్స్‌లో చూస్తారు. సమయపాలన ఆయన ఆరో ప్రాణం. ఉదయం నాలుగున్నరికి కలుద్దాం బ్రదర్ అంటే ఆ సమయానికి ఆయన కుర్చీలో సిద్ధంగా వుంటారు. సంబంధిత సమాచారంతో కలుసుకోవలసిందే. ఆయన్ని ప్రసన్నం చేసుకోవడం చాలా కష్టం. పంక్చువాలిటీకి ప్రాణమిస్తాడు.

ఆయనకి మంచి ధారణ శక్తి ఉంది. కిందటి రోజున ఏ సందర్భంలో చర్చ ఆగిపోయిందో సరిగ్గా అక్కడి నుంచే చర్చ ప్రారంభించేవారు. ఆయన సునిశిత పరిశీలన గురించి ఓ విషయాన్ని చెప్పాలి. హీరో తన ఫ్రెండ్స్‌తో కలిసి క్లబ్‌కి వెళతాడు. మందు తాగుతుంటారు. ఇంతలో ప్రతి నాయకుడు కనిపిస్తాడు. దానికి ఆయన పక్కనే పెన్సిలుతో "హీరో ఫ్రెండ్స్ మందు తాగవచ్చును. హీరో మందు తాగుతున్నట్లు నటించి పక్కనేవున్న ఫ్లవరు వాజులో పారబోయవలయును" ముత్యాల్లాంటి అక్షరాలతో సున్నితంగా సవరించేవాడు. కథలో హీరోతో సమానంగా ప్రతి నాయకుడ్ని స్వీకరించేవారు. విలన్ అని రాస్తే ప్రతి నాయకుడు అని సరిదిద్దేవాడు. హీరో అనేవాడు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా వుండేవాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనకూడదు అనేవారు.

ఆయన స్క్రిప్ట్‌ని ఫైనలైజ్ చేసే విధానం చిత్రంగా వుంటుంది. స్క్రిప్ట్ పూర్తయ్యాక యూనిట్‌ని పిలిచి కవిగారి చేత చదివి వినిపించేవారు. వారి స్పందనను నిశితంగా పరిశీలించేవారు. ఒకరికి తెలియకుండా మరొకరి అభిప్రాయాలను కూడా సేకరించేవారు. ఆ స్క్రిప్ట్ తృప్తిగా అనిపిస్తే పక్కన పెట్టేవారు. మళ్ళా ఆరు మాసాల తర్వాత మరో షూటింగ్ అప్పుడు కూడా అదే స్పందన అదే ఆనందం యూనిట్ బృందం వ్యక్తపరిస్తే అప్పుడు ఆ స్క్రిప్ట్‌ని చిన్నాయనకిచ్చి చదివి బైండు చెయ్యమనేవారు. చిన్నాయన అంటే త్రివిక్రమరావుగారు.

ఎన్.టి.ఆర్. ఇంట్లో ఆడిటర్ ప్రత్యేకించి వుండడు. ఫైల్లు, పేడ్స్,పేపర్స్, బైండ్ బుక్ అన్నీ స్వయంగా త్రివిక్రమరావుగారే తయారు చేస్తారు. వారు వాడుతున్న "సిరా" సైతం చిన్నాయన స్వయంగా కరక్కాయ రంగు సిరా తయారు చేసి సీసాల నిండా నింపేవాడు. వయిలెట్ కలర్ ఇంక్ వాడేవారు. ఒకసారి ఆంధ్రా బ్యాంకు మేనేజర్ ఇంటికి వచ్చి "అయ్యా ... రూల్సు మారాయి. మీరు ఆ సిరాతో చెక్కులు రాస్తే స్వీకరించలేము!" అంటూ సవినయంగా మనవి చేశాడు. స్వీకరించకపోతే శెలవు తీసుకోండి.. మరో బ్యాంకు వారికి అవకాశం కల్పిస్తాం అన్నారు. చేసేది లేక నందమూరి సోదరులకు మినహాయింపు ఇచ్చారు.

అయిదున్నర గంటలకు మేకప్‌మేన్ పీతాంబరం లేదా ఆయన సహాయకుడు ముత్తు వచ్చేవాడు. కాస్ట్యూమర్ మోక రామారావు ఆయన అసిస్టెంట్ బాబూరావు, డ్రైవర్ కృష్ణ అంతా సిద్ధంగా ఉండేవారు. మేకప్‌ని ఓ పవిత్రమైన కార్యంగా భావించేవారు. బొట్టు పెట్టగానే ఆ నటరాజస్వామిని తలచుకుంటూ మౌనంగా ధ్యాన ముద్రలో వుండిపోయేవారు.

పౌరాణిక చిత్రాల్లో కృష్ణుడు, రాముడు, రావణుడు, దుర్యోధనుడు, కర్ణుడు, భీష్ముడు ఏ పాత్రలు వేసినా మద్యమాంసాలకు దూరంగా ఉండేవారు. మేకప్ వేసుకున్నది మొదలు

షూటింగు పేకప్ చెప్పేటంత వరకూ అలంకారం తీసేవారు కారు. ఆ బరువు మోసి తీరవలసిందే!

ప్రతి రోజు ఓ అరగంట సమయం నిర్మాతల కోసం కేటాయించేవారు. నిర్మాతల యోగ క్షేమాల్ని అడిగి తెలుసుకోనేవారు. ఆయన తరచు అంటుండేవారు "బ్రదర్ ఈ లోకంలో ఎవడు చెడ్డ తెలివితేటలు ఎక్కువై చెడడు. అమాయకుడు, నిజాయితీపరుడు ఎప్పుడూ చెడిపోలేదు. చేసిన తప్పులు దిద్దుకోవడం గొప్పతనం. అటువంటి వారికే నా దగ్గర చోటు!" అనేవారు.

తిరుపతి వెళ్ళొచ్చిన టూరిస్టు బస్సులన్నీ ఎన్.టి.ఆర్ ఇంటి ముందే ఆగేవి. ఒక పది బస్సులు పోగయ్యాక బైటికి వచ్చి అందర్నీ ప్రేమగా పలకరించి కుశల ప్రశ్నలు వేసి ఆ అభిమానులకు తనివితీరేలా మాట్లాడేవారు. రైతులు వస్తే నాట్లు వేసింది మొదలు కోతల వరకు సమాచారం అడిగి తెలుసుకొనేవారు. వ్యవసాయం దిగుబడి మీద మంచి అవగాహన వుండేది.

ఎనిమిదిన్నరయితే షూటింగ్‌కి బయల్దేరేందుకు సిబ్బంది సిద్ధంగాడు ఉండేవారు. ఆయన బైటికి వచ్చినప్పుడు వాకిలికి ఇరువైపుల సింహాలు మధ్యలో రారాజులా కనిపించేవాడు. బసవరామ తారకమ్మ ఎదురొచ్చేవారు. ఎన్.టి.ఆర్. పేరు చెప్పుకొనే చిత్రకారులు. పుండరీకాక్షయ్య, బలరామయ్యలు ఎస్కార్ట్‌లుగా ఉండేవారు. ఎన్.టి.ఆర్. బావమరిది రుక్మాందరావు ఆగమేఘాల మీద ఎన్.టి.ఆర్ ఆదేశాల్ని అమలు చేసేవాడు. ఎన్.టి.ఆర్. దగ్గర ఏ వ్యవహారం అయినా 'క్రియ' ప్రధానంగా వుండి తీరాలి. రిజల్ట్ ఓరియంటెడ్‌గా ఉండాలి.

సెట్‌లో ఎన్.టి.ఆర్. పని చేసే విధానం నేటి తరానికి ఆదర్శం. ఫ్లోర్‌లో అడుగుపెట్టింది మొదలు లంచ్ బ్రేక్ వరకూ తనూ కూర్చోడు. యూనిట్‌లో ఎవర్నీ కూర్చోనివ్వడు.పని..పని..పని ప్రొడ్యూసరు పెట్టిన ప్రతి రూపాయికి నటీనటులు సాంకేతిక నిపుణులు జవాబుదారీగా ఉండాలన్నది ఆయన సంకల్పం. ఆయన ఎంత కమిట్‌మెంట్‌తో ఉంటారంటే "సర్కస్ రాముడు" చిత్రం షూటింగ్ బెంగళూర్ ప్యాలెస్‌లో జరుగుతుంది." అమావాస్యకి పున్నమికి రేగిందంటే మావో.. పంబరేగిందంటే మావో".. వేటూరి పాట, మహదేవన్ సంగీతం .ఎన్.టి.ఆర్, రావు గోపాలరావు మీద చిత్రీకరణ. సాయంత్రం నాలుగు గంటలకు ఫైట్, ఉదయం సీన్సు చేసి పాట పన్నెండు గంటలకి ప్రారంభించారు. బ్రేకు లేకుండా షూటింగు చేస్తున్నారు. మధ్యలో ఎన్.టి.ఆర్. ప్యాంటు చిరిగింది అయినా పట్టించుకోలేదు. అలాగే షూటింగు పూర్తి చేసి ఆ తరువాత లంచ్ చేసి బయల్దేరాడు. అది ఎన్.టి.ఆర్. అంకిత భావం.

సాయంత్రం ఇంటికి రాగానే మళ్ళీ స్నానపానాదులు ముగించి మళ్ళీ దర్బారులో కూర్చుంటారు. వరుసగా ప్రొడ్యూసరు బాగోగులు, కొత్త సినిమాకు సంబంధించిన కథలూ మధ్య మధ్యలో వేడివేడి పకోడీలు, వేరుశెనగకాయలు, పప్పు, బెల్లం, స్వీట్లు అయితే. తిరుపతి కళ్యాణం లడ్డు, తిరుపతి జిలేబీ, తాపేశ్వరం కాజా, కాకినాడ కాజా, బందురు లడ్డూ, ఆత్రేయపురం పూతరేకులు అన్నీ స్పెషల్ ఐటమ్స్ చోటు చేసుకునేవి. కేవలం ఎన్.టి.ఆర్‌ని ఆశ్రయించుకుని కొంతమంది నటీనటులూ సాంకేతిక నిపుణులు ఉండేవారు. వారి స్థితిగతులను తెలుసుకొని అక్కడికక్కడే వారి సమస్యను పరిష్కారం చూపించేవారు.

ప్రబంధ కవులందర్నీ చదివాడు. సమకాలీన సాహిత్యం మీద మంచి పట్టు ఉంది. పోతన గురించి ఎంత అనర్గళంగా మాట్లాడగలడో శ్రీశ్రీ గురించి అంతే సున్నితంగా చెప్పగలడు. ఎన్.టి.ఆర్. పాత్రలను చదివి నెమరు వేసుకోవడం గాకుండా ఆ పాత్రలను పరిశోధన చేసి ఇలాగే ఎందుకు ఉండాలి, ఇలా ఎందుకు ఉండకూడదు అని రీసెర్చ్ చేసి అప్పుడు ఆయా పాత్రలను ఆవిష్కరించేవాడు.

ఎన్.టి.ఆర్. ది కె.వి.రెడ్డి స్కూలు. కె.వి.రెడ్డి మీద అపారమైన భక్తి విశ్వాసాలున్నాయి. ఒకరోజు రెడ్డిగారు వచ్చి నువ్వు నాకు సహాయం చెయ్యాల అన్నాడు! ఎన్టీఆర్ తన కళ్ళను నమ్మలేకపోయాడు. అబ్బాయి అమెరికాలో చదువుతున్నాడు. ఆ ఏర్పాట్లు నువ్వు చెయ్యాలప్పా! వూరికే చెయ్యనవసరం లేదు నేనే నీకో సినిమా చేసిపెడతాను! అన్నాడు. అంతటి ఆత్మభిమానం గల వ్యక్తి కె.వి.రెడ్డి "సినిమా సంగతి తర్వాత చూద్దాం. ముందు బాబు అమెరికా ఏర్పాటు తమ్ముడు చూస్తాడు. మీరు నిశ్చింతగా ఉండండి!. అంటూ ఆ ఏర్పాట్లు చూడమని తమ్ముడికి చెప్పాడు. అందుకు గాను కె.వి.రెడ్డి గారికి" శ్రీకృష్ణ సత్య" చిత్రం దర్శకత్వం బాధ్యతలు అప్పగించాడు. గురుశిష్యులు మధ్య అంతటి అవినాభావ సంబంధం ఉంది.

అలాగే ఘంటసాల మాస్టార్ విషయంలోనూ నందమూరి సోదరులు ఉదార స్వభావాన్ని చూపించి పారితోషికం పెంచారు. నిలయ విద్వాంసులుగా టి.వి రాజు, పెండ్యాల రాజేశ్వరరావు, విజయ కృష్ణమూర్తి, జోసెఫ్ కృష్ణ, బి. గోపాల, సముద్రాల సీనియర్, జూనియర్, డి.వి.నరసరాజు, యోగానంద్ కమలాకర్ ఇటువంటి దిగ్గజాలందరూ పనిచేస్తూ ఉండేవారు.నటన విలువ, నర్తనం విలువ, సినిమా జీవితం విలువ, అభిమానుల విలువ తెలిసి మసలుకున్న నట యోగి ఎన్.టి.రామారావు. ఆయన జీవన పయనంలో ఎదురైనా అద్భుతాలన్నీ ... అనితర సాధ్యమైన విజయాలన్నీ భావితరాలకి స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతాయి.

-ఇమంది రామారావు

9010133844

'కన్యాశుల్కం'లో షావుకారు జానకితో...

'పాతాళ భైరవి'లో...

'గుండమ్మ కథ'లో ఎస్వీఆర్,అక్కినేనితో

'యుగంధర్'గా...

'కలసి వుంటే కలదు సుఖం'లో...



భార్య బసవ తారకంతో..

వెన్నులో వణుకు పుట్టించే రక్తసిక్త కథలు, కర్కశ కల్పనలు. అడవి మనిషి అంటేనే తెలియని ఆకర్షణ, భయం. కానీ, వాస్తవానికి ఆధునికుడి విధ్వంసకర పురోగతే స్వార్థ ప్రవృత్తే అడవి మనిషి కన్నా భయంకరమైంది. ఆధునికుడి ఆటవిక అన్యాయానికి బలైపోతున్నాయి అండమాన్ తెగలు. మంచు యుగాన్ని భయంకరమైన సునామీలను తట్టుకుని 65 వేల ఏళ్లుగా మనుగడ సాగిస్తున్న పూర్వీకుల జాతి, ఆధునికుడి అడుగు కింద అంతమైపోతున్నాయి. అవతార్, అపోకలిప్టో సినిమాల్లో కళ్లకు కట్టిన విధంగా మనుగడ పోరాటం చేస్తూ ఒక్క జాతి మాత్రమే నిలిచింది. మిగతావి చావు దెబ్బతిని అంపశయ్య మీదకు చేరాయి.

అండమాన్‌లో అవతార్

జారవా బాలుడు

అండమాన్ నికోబార్ ద్వీప సముదాయం తొలి మనిషి జాడల్ని పదిలం చేసుకుంది. బాహ్య ప్రపంచానికి సంబంధం లేని మూల వాసులకు ఆవాసమైంది. కానీ గత వందేళ్లుగా ఆధునిక మానవుడి జోక్యంతో అండమాన్ జాతుల జీవన యాత్ర అంతానికి చేరువైంది. క్రీ.శ. రెండో శతాబ్దంలో టాలెమీ పేర్కొన్న నరమాంస భక్షకులు, ఆ తర్వాత క్రీ.శ.1296లో మార్కోపోలో సాహస యాత్రలో నావికుల్ని హతమార్చి తినేసిన మృగమనుషుల విషయాలు ఈ దీవుల ప్రస్తావనలోనివే. కానీ, అంత క్రూరంగా వర్ణించినట్టు ఇక్కడి జాతుల తీరు లేదు. నాగరికులకు ఏ మాత్రం తీసిపోని విధంగా శాంతిపూర్వకమైన జీవన విధానంతో సంతోషంగా, ఉల్లాసంగా బతుకున్న స్వేచ్ఛాజీవులు వీళ్లు. ప్రకృతిని ప్రేమిస్తూ మమేకమైన స్వచ్ఛమైన మనుషులు వీళ్లు. ఎన్నో ఉప తెగలున్నా ముఖ్యంగా నాలుగు జాతులుగా వీరిని పరిగణిస్తారు. అవే గ్రేట్ అండమానిస్, జారవా, ఓంగె, సెంటినల్‌లు. తమదైన ప్రత్యేక ప్రపంచం, జీవనంతో ఏ మార్పు రాకుండా బతుకుతున్నారు.

భూమి బిడ్డలు... జారవాలు

అత్యంత పూర్వజాతి అయిన జారవాలు అండమాన్ మూలవాసులు. దక్షిణ భారతదేశ ప్రజల జన్యు క్రమం వీరి జన్యు క్రమాన్ని పోలి ఉంది. జారవా అంటే భూమి బిడ్డలని వారి భాషలో అర్థం. దక్షిణ అండమాన్ ద్వీపాల్లో జీవిస్తున్న వీరు వేటలో మేటి. ప్రకృతితో మమేకమైపోయిన వీరికి వన ఓషధుల విషయంలో మంచి పట్టు ఉంది. తేనెను సేకరించే దగ్గర నుంచి గర్భ నిరోధకం వరకు అడవి మొక్కల్ని ఉపయోగిస్తారు. 150 రకాల మొక్కలు, 350 రకాల జంతువులు వీరికి తెలుసు. బిడ్డ జననం, రజస్వల, రుతుస్రావం, వివాహం వంటి కీలక విషయాల్లో వీళ్లు ఆరోగ్యకరమైన ఆచారాలను పాటిస్తారు. వీరి తేనె సేకరణ విధానం ప్రత్యేకం. పూయేక్వెలోవ్ ఆకుల్ని నమిలి తుట్టె మీద ఊస్తారు. అది తేనేటీగల్ని తరిమికొడుతుంది. తేనె తిన్నాక సామూహిక స్నానం చేయడం వారి ఆచారం. ఆయుధాల తయారీకి వాడే చూయ్ కలప కోసం వందల మైళ్ల ప్రయాణించి బారాతాంగ్ ద్వీపానికి వెళతారు. అబ్బురపరిచే బురద వెదజిమ్మే నెలవులకు, సుందరమైన సున్నపురాతి గుహలకు బారాతంగ్ పేరొందింది. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు తోడు అండమాన్ జాతీయ రహదారి గ్రాండ్ ట్రంక్ రోడ్డు ప్రయాణీకుల వల్ల వీరి జీవనానికి విఘాతం కలిగింది. ట్రంక్ రోడ్డు వీరి ఆవాస ప్రాంతం మధ్యగా పోతుంది. వీరి ఆవాసాల ఆక్రమణలు, అడవుల్ని కొట్టేయడం, వన్యమృగాల అక్రమ వేట వల్ల జారవాల నివాస ప్రాంతం, ఆహార లభ్యత క్షీణించింది. వీరిని అడవిలో జంతువుల మాదిరిగా సందర్శించే మానవ సఫారీలు ఎక్కువయ్యాయి. ఆవాసాల్లో చొరబడి మహిళలపై అత్యాచారాలకు ఒడిగడు తున్నారు బయటివారు. మత్తు పదార్థాలు తెలీని వీరికి మద్యం, గంజాయిని అలవాటు చేసి బానిసలుగా మారుస్తున్నారు.

కొత్తవారి సాంగత్యం వల్ల అంటు వ్యాధులు ప్రబలి వీరు తుడిచి పెట్టుకు పోతున్నారు. 1999 నుంచి 2006 మధ్య తట్టు వ్యాప్తి చెంది చాలా మంది బలయ్యారు. ఇప్పుడు 400 మందిలోపే మిగిలారు. అనేక సేవా సంఘాల పోరాటంతో 2002లో సుప్రీం కోర్టు మానవ సఫారీలను నిషేధిస్తూ తీర్పునిచ్చింది. ట్రంకు రోడ్డు మూసివేయాలని, బలవంతపు అభివృద్ధి యత్నాన్ని నిలిపేయాలని పలు సంస్థలు కోరుతున్నాయి.

అరణ్య రోదన

బో తెగ చివరి వ్యక్తి అయిన బోవా సీనియర్ 2010 జనవరిలో తుదిశ్వాస విడిచింది. సుమారు 55 వేల ఏళ్లుగా మనుగడ సాగించిన జాతి తుదిశ్వాస అలా అన్యాయంగా అనంత వాయువుల్లోకి చేరింది. "సెంటినల్స్, జారవాలు బాహ్య ప్రపంచంతో సంబంధాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం వల్లే బతికిపోయారు. మా జాతికి ఆ అదృష్టం లేదు..." అని నిర్వేదంగా పలికిన బోవా సీనియర్ మాటలు ఆధునిక మనిషి జోక్యం ఎలా మూల జాతుల వినాశనానికి కారణమైందో స్పష్టం చేస్తాయి. 1970లో స్థానిక అధికారులు మిగిలిన తెగల వారిని స్ట్రైట్ ద్వీపానికి తరలించారు.

ది గ్రేట్ డిజాస్టర్

ది గ్రేట్ అండమానీస్ అంతానికి చేరువయ్యారు. జేరు, బీయా, బో, ఖోరా, పుఖివార్ తదితర పది తెగలున్న ఈ జాతిలో మిగిలింది సుమారు 300 మంది. చాలా తెగలు ఇప్పటికే అంతమైపోయాయి. వందేళ్ల క్రితం వరకు ఎటువంటి జోక్యం లేకుండా తమ మానాన తాము జీవించిన వీళ్లు బ్రిటీష్ వలస స్థావరాల వల్ల దారుణంగా దెబ్బతిన్నారు. 1858లో ఐదు వేలకు పైగా ఉండేవారని లెక్క. బ్రిటీష్ వారి దాష్టికంతో భూమి కోసం యుద్ధాల్లో చాలా మంది హతులయ్యారు. మిగతావారు బ్రిటీష్‌వారి అంటు వల్ల ఆటలమ్మ, మలేరియా, సిఫిలిస్, ఇన్‌ఫ్లూయెంజా, తట్టు వంటి అంటు వ్యాధుల బారిన పడి పెద్ద సంఖ్యలో మృతిచెందారు. 1860లో అండమాన్ హోమ్ అనే కేంద్రంలో వందల సంఖ్యలో గ్రేట్ అండమానీస్‌ను నిర్బంధించారు. వీరంతా కొత్త రకాల వ్యాధుల వల్ల చనిపోయారు. సుమారు 150 మంది శిశువులు ఈ కేంద్రంలో పుట్టి రెండేళ్ల లోపే చనిపోయారని రికార్డుల్లో ఉంది. క్యాంపుల్లో ఇప్పుడు కేవలం యాభై మందే మిగిలారు. చాలా మంది టీబీతో బాధపడుతున్నారు.

లోపం లేని జాతికి శాపం

ఓంగెలు తమని ఎన్ ఇరిగాలే అని చెప్పుకుంటారు. దాని అర్థం లోపం లేని వ్యక్తులని అర్థం. లిటిల్ అండమాన్ ద్వీపమే వీరి ఆవాసం. ఇప్పుడా ద్వీపంలో బయటివారు 18 వేల మంది చొరబడి ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. 1900 శతాబ్దం వరకు బాహ్య ప్రపంచానికి వీరి మనుగడ తెలీదు. అప్పుడు 670 మందిని లెక్కించగా ఇప్పుడా సంఖ్య సుమారు వంద మందికి పడిపోయింది. వీరిని జనజీవన స్రవంతిలోకి తెచ్చే పేరిట బానిసలుగా మార్చి స్థానిక కొబ్బరి తోటల్లో పని చేయిస్తున్నారు.

2004లో వచ్చిన సునామీని ఓంగెలు ముందే గమనించి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఒక్కరు కూడా మృతి చెందలేదు. సముద్ర అలల ఆటు పోట్ల భేదం, అడవుల్లోని నీటి మట్టాల తేడా, జంతువుల భిన్న ప్రవర్తనను గమనించి సునామీని ముందుగానే ఊహించి ఎత్తైన ప్రాంతాలకు తరలిపోయారు. తర్వాత వారు తండాలమ్ ప్రాంతానికి వెళ్లిపోయారు. క్యాంపులకు అలవాటు పడలేక భ్రూణ, శిశు మరణాల రేటు ఎక్కువైంది. వీరిని సమాజం ఎంత చులకనగా చూస్తోందంటే, ప్రభుత్వ శిబిరంలోని ఒక ఓంగె మహిళ బిడ్డకు జన్మనిస్తే, అదేదో అంతరించిపోతున్న అడవి జంతువు పిల్లకు జన్మనిచ్చినట్టు స్థానిక పత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది.

సెంటినెల్స్ సమరం

సునామీ సందర్భంలోనే ప్రపంచం దృష్టిని ఆకర్షించిన మరో మూల జాతి సెంటినెల్స్. సర్వేకు వెళ్లిన ఓ హెలికాప్టర్‌ను తమ ప్రాంతంలోంచి తరిమేందుకు ఓ సెంటినల్ బాణాల వర్షం కురిపించాడు. అలా వారి మనుగడ మళ్లీ వార్తల్లోకి వచ్చింది. రెండు శతాబ్దాల నుంచే వీరితో సంబంధానికి ప్రయత్నిస్తున్నా, మిగతా తెగల దుస్థితి తెలుసుకున్నారేమో బయటి వ్యక్తులు చొరబడకుండా తమ ఉత్తర సెంటినల్ ద్వీపాన్ని పహారా కాస్తున్నారు. హద్దు దాటితే దాడులకు దిగుతున్నారు. నాగరికుడి నీడ పడి భస్మమైపోకుండా రక్షించుకుంటున్నారు. మొత్తం 500 మంది ఉండొచ్చని ఊహిస్తుండగా, 39 మంది బృందాన్ని లెక్కగట్టారు.
ఒకప్పుడు ఆఫ్రికా నీగ్రోల బానిస వర్తకం దాష్టికాన్ని ప్రత్యక్షంగా గమనించడంతో నాగరికుల్ని ద్వేషిస్తారనేది పరిశోధకుల వాదన. 1800లో ఎం.వి.పోర్ట్‌మెన్ అనే బ్రిటీష్ ఇంచార్జి పెద్ద బృందంతో ఈ ద్వీపంలో అడుగుపెట్టాడు. వారికి ఎదురుపడిన ఇద్దరు వృద్ధులు, నలుగురు పిల్లల్ని పరిశోధన పేరిట పోర్ట్‌బ్లెయిర్‌కు తరలించగా, జబ్బుపడి వృద్ధులు చనిపోయారు. కొన్ని పరీక్షలు జరిపి పిల్లల్ని తిరిగి ద్వీపంలో వదిలేశారు. 1967లో టి.ఎన్. పండిట్ నేతృత్వంలో ఓ బృందం పరిశోధన చేసింది. "సెంటినల్స్ చాలా ఆరోగ్యంగా, సంతోషంగా జీవిస్తున్నట్టు సముద్రం ఒడ్డున కనిపించిన సమూహాన్ని బట్టి తెలుస్తోంది. వారిలో చాలా మంది పిల్లలు, గర్భవతులు ఉన్నారు. ముఖాలకు, చేతులకు తీగలతో నేసిన ఆభరణాలు ధరించారు. స్వేచ్ఛగా, కలిసిమెలిసి సహజీవనం సాగిస్తున్నారు. మన జోక్యంతో వారి శ్రేయస్సుకు ప్రత్యేకంగా చేయాల్సింది ఏమి లేదనిపిస్తోంది. అది ఇంకా ప్రమాదకరం కూడా." అని పండిట్ అభిప్రాయపడ్డారు. మిషన్‌ను 1996లో పూర్తిగా నిలిపేశారు. మన మూలాల్ని మనమే చేతితో పెరికేసే చర్యలను ఇకనైనా కట్టిపెడితే మంచిది.

-అజయ్ కుమార్ వారాల

సెంటినల్స్

ఓంగే జాతి మనిషి

జారవా

గ్రేట్ అండమానీస్

అట్ట మీది కథ

రోళ్లు పగల కొట్టే రోహిణి కార్తె తరువాత తొలకరి పలకరింపుతో పుడమి తల్లి పులకరించిపోతుంది. నీలి మేఘాల ఆకాశం కారుమబ్బుల కొత్త రంగును పులుముకుంటుంది. ఆ మబ్బులను తొలుచుకుంటూ నేలమీదకు జాలువారే ప్రతి నీటి బొట్టూ ఒకొక్క అమృత బిందువవుతుంది. బీడువారి, బీటలు వారిన భూములు కొత్త సొగసులు అద్దుకుంటాయి. చిటపట చినుకులతో తడిసిన మట్టి గమ్మత్తుగా సువాసనలను వెదజల్లుతుంది. కర్షక వీరులు కర్మ జలాలను చిందించడానికి నూతనోత్సాహంతో సిద్ధమవుతారు. వానా వానా వల్లప్పా ...అంటూ చిన్నారులు చిరుజల్లులకు స్వాగతం పలుకుతారు. రుతుపవానాలు తీసుకువచ్చే తొలకరి జల్లుల చుట్టూ అల్లుకున్న అనుబంధాలివి!

పెరిగిన పట్టణీకరణ, తప్పనిసరై బుర్రకెక్కించుకుంటున్న ఆంగ్ల చదువులు 'రెయిన్...రెయిన్ గో అవే ...' అని రాగాలు తీయిస్తున్నప్పటికీ తొలి చినుకుల పలకరింపు పల్లెటూరి పేగును కదిలించి పులకరింపచేస్తుంది. అందుకే నలుపు, తెలుపు రోజుల నుండి అత్యాధునికతను అంతరించుకున్న ఇప్పటి వరకు సినిమాల్లో వానపాటలంటే అంత క్రేజ్...! చిటపట చినుకులకు ఒక రచయిత చెలికాడిని తోడు తెచ్చుకుంటే, మరొకరు రాకరాక గాలివాన వస్తే తడవకుండా ఉండనా ఇంటిలోనా అని ప్రశ్నిస్తారు. నువ్వొస్తానంటే... నే వద్దంటానా! అంటూ చిరుజల్లులలో ఒక నాయిక వేసిన చిందులు మరచిపోలేం! ఇంతటి హర్షాన్ని పంచే తొలకరి జల్లుల కథేమిటి? రుతురాగాలు చెప్పే విషయాలేమిటి? ఈ వారం అట్టమీది కథలో.

రుతు రాగాలు

వి.రాజగోపాల్

కేరళలో రుతుపవనాల సందడి ప్రారంభమైంది. జూన్ ఒకటవ తేదీన రుతుపవనాలు కేరళను పలకరిస్తాయన్నది వాతవారణ శాఖ వేసిన తొలి అంచనా! ఆ తరువాత ఈ నెల 30, 31వ తేదీల్లోనే రుతుపవనాలు వచ్చేస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే, రుతుపవనాల రాకకు ముందే ముందస్తు వర్షాలు కేరళను పలకరిస్తున్నాయి. రుతుపవనాల ప్రవేశం తరువాత ఈ వర్షపు జోరు మరింత పెరగనుంది. వర్షాలతో పాటే రుతుపవనాల తొలి పలకరింపునకు పులకరించిపోవడానికి పెద్ద ఎత్తున పర్యాటకులూ ఆ రాష్ట్రానికి బారులు తీరనున్నారు. మండు వేసవి తరువాత తొలకరి జల్లుల తొలి పలకరింపు భాగ్యం కేరళదే! ప్రతి ఏడాది మే నెలాఖరు నుండి జూన్ ఒకటి, రెండు తేదీల్లోగా రుతుపవనాలు కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంతో పాటు పరిసర ప్రాంతాల్లోకి తొలుత ప్రవేశిస్తాయి. అక్కడి నుండి జులై నెలాఖరు నాటికి దేశమంతా వ్యాపిస్తాయి. మే నెలాఖరులో కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు తమిళనాడు, కర్నాటకల మీదగా మన రాష్ట్రానికి చేరుకుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలో తొలి తొలకరి జల్లులు కురుస్తాయి. మన రాష్ట్రం నుండి బంగాళాఖాతం మీదుగా త్రిపుర, మణిపూర్ వరకు ఇవి విస్తరిస్తాయి. సెప్టెంబర్ నెల వరకు ఈ రుతుపవనాల ప్రభావం దేశ వ్యాప్తంగా ఉంటుంది.

రుతుపవనాలు అంటే ...!

కాలానుగుణంగా గాలి పయనంలో జరిగే

'నైరుతి' కీలకం!

దేశ వ్యాప్తంగా వ్యవసాయ రంగంతో పాటు, పరిశ్రమలకు నైరుతి రుతుపవనాలు అత్యంత కీలకం. మండుటెండల్లో ఎండిపోయిన చెరువులు, బోర్లు, బావులు నైరుతి రుతువపనాల సమయంలో పడే వర్షం కారణంగానే నీటితో నిండుతున్నాయి. దేశ వ్యాప్తంగా అత్యధిక భాగం నదులకు ఈ సీజన్‌లోనే జలకళ వస్తుంది. ఫలితంగా వ్యవసాయ పనులు ముమ్మరమవుతాయి. నదుల్లో నీరు పెద్ద ఎత్తున పారుతుండటంతో జల విద్యుత్‌కు కొరత ఉండదు. ఫలితంగా పారిశ్రామిక, వాణిజ్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగుతాయి. నైరుతి రుతుపవనాలు సకాలంలో రాకపోయినా, వచ్చినా సాధారణ స్థాయిలో వర్షం కురవకపోయినా దేశ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావమే ఉంటుంది.

ఒక మార్పును రుతుపవనం అంటాం. అప్పటిదాకా ఒక ప్రాంతంలో ఉన్న గాలి స్థానంలో కొత్తగా బలంగా వచ్చే గాలులు, ఈ గాలి పయనంలో చోటు చేసుకునే మార్పులు వాతావరణంపై ప్రభావం చూపుతాయి. వాతావరణంలో వచ్చే తడిపొడి మార్పులకు ఇవే కారణం. చల్లటి ప్రాంతం నుండి ఉష్ణ ప్రాంతాలకు ఇవి ప్రయాణం చేస్తాయి. ఈ క్రమంలోనే వర్షాన్నిస్తాయి. భారత ఉపఖండంలో ఏర్పడే రుతుపవనాలు హిందూ మహాసముద్రంతో ప్రధానంగా సంబంధాలు కలిగి ఉండి ఆగ్నేయ ఆసియా ప్రాంతంలో వాతావరణాన్ని నిర్దేశిస్తాయి. రెండు రకాల రుతుపవనాలు భారతదేశంపైనా ఆగ్నేయ ఆసియా పైనా ప్రభావం చూపుతాయి. వీటిలో మొదటిది వేసవి కాలం ముగిసిన వెంటనే వచ్చే నైరుతి రుతుపవనాలు. భారత ఉపఖండం ఉత్తరార్ధగోళంలో ఉష్ణమండల జోన్‌లో ఉత్తరం వైపునకు హిమాలయాలు, హిందూకుష్ పర్వతాల వరకు వ్యాపించి ఉన్న సంగతి తెలిసిందే! నైరుతి రుతుపవనాల ప్రభావం ఈ ప్రాంతమంతా ఉంటుంది. హిందూ మహా సముద్రంపైన నీటితో కూడిఉన్న చల్లటి గాలులు మే నెలాఖరు నుండి నైరుతి దిశలో వీచడం ప్రారంభిస్తాయి. అందుకే వీటిని సౌత్-వెస్ట్ మాన్‌సూన్ అని, నైరుతి రుతుపవనాలని పిలుస్తారు. సాధారణంగా సెప్టెంబర్ నెల వరకు ఈ నైరుతి రుతుపవనాలు కొనసాగుతాయి. భారత ఉపఖండంలో అత్యధిక వర్షపాతం ఈ రుతుపవనాల సమయంలోనే నమోదవుతుంది. హిందూమహాసముద్రం నుండి ప్రయాణం ప్రారంభించిన తరువాత నైరుతి రుతుపవనాలు రెండు శాఖలుగా చీలిపోతాయి. భారతద్వీప కల్పపు దక్షిణ చివరి భాగంగా ఏర్పడే ఈ చీలిక కారణంగా ఉత్తర, దక్షిణ భారతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరిస్తాయి. అరేబియా సముద్రం మీదుగా ఒక చీలిక ఉత్తర భారతంవైపు ప్రయాణం చేస్తే, మరొకటి బంగాళాఖాతం వైపుగా విస్తరించి దక్షిణ భారతదేశంలో వర్షాన్నిస్తుంది. దేశవ్యాప్తంగా వ్యవసాయానికి నైరుతి రుతుపవనాల ద్వారా కురిసే వర్షమే ప్రధాన ఆధారం. అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు ఈశాన్య రుతుపవనాలు వీస్తాయి. కొన్ని సంవత్సరాల్లో వీటి ప్రభావం ఏప్రిల్ వరకు కూడా ఉంటుంది. అయితే, ఈశాన్య రుతుపవనాల వల్ల దేశవ్యాప్తంగా స్వల్పంగానే వర్షపాతం నమోదవుతుంది. వాయువ్య చైనాలో మంగోలియాకు ఎగువ ప్రాంతంలో ప్రారంభమయ్యే ఈశాన్య రుతపవనాలు భారత దేశానికి చేరే సమయానికి చాలా భాగం పొడిబారిపోతాయి. నైరుతి రుతుపవనాల సమయంలో సముద్రం నుండి భూమి మీదకు వీచిన గాలులు, ఈశాన్య రుతుపవనాల సమయంలో దానికి భిన్నంగా భూమి మీద నుండి సముద్రం మీదకు వీస్తాయి. మంగోలియా, ఆగ్నేయ చైనాల నుండి ప్రారంభమయ్యే ఈశాన్య రుతుపవనాలు భారత ఉపఖండం మీదుగా హిందూ మహాసముద్రానికి చేరుకుంటాయి, అయితే వీటిలో అత్యధిక భాగాన్ని హిమాలయ పర్వతాలు నిరోధిస్తాయి. ఫలితంగా ఈశాన్య రుతుపవనాల ద్వారా వచ్చే వర్షపాతం ఎక్కువ భాగం హిమాలయాల అవతలివైపునకే పరిమితమవుతుంది. వర్షపునీటిని ఆపడంతో పాటు ఈశాన్య రుతుపవనాలు తీసుకువచ్చే గడ్డకట్టించే చలిగాలులను కూడా హిమాలయాలు ఆపుతాయి. ఫలితంగా దక్షిణ భారతదేశం, శ్రీలంక వంటి ప్రాంతాల్లో సంవత్సరమంతా వాతావరణం దాదాపు పొడిగా ఉంటుంది. ఈశాన్య రుతువపనాల కారణంగా భారతదేశంలోని కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో కొంతమేర వర్షపాతం నమోదవుతుంది. దక్షిణ భారతదేశంలో వరిపంట ప్రధానంగా సాగు కావడానికి, భారతదేశపు అన్నపూర్ణగా ఈ ప్రాంతం పేరు పొందడానికి నైరుతి రుతుపవనాలే కారణం. ఈ రుతుపవనాల కారణంగా పసిఫిక్ తీరప్రాంతంతో పాటు, ఇండోనేషియా, మలేషియా వంటి దేశాల్లోనూ వర్షాలు కురుస్తాయి.

తెలుగు రాష్ట్రాల్లో రుతుపవనాల ప్రభావం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సగటున ఏడాదికి నమోదయ్యే వర్షపాతం : 940 మిల్లీమీటర్లు

నైరుతి రుతుపవనాల ద్వారా

(జూన్ నుండి సెప్టెంబర్ వరకు)

624 మి.మీ (మొత్తం వర్షపాతంలో 66శాతం)

ఈశాన్య రుతుపవనాల ద్వారా

(అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు)

224 మి.మీ (మొత్తం వర్షపాతంలో 24శాతం)

శీతాకాలంలో 14 మి.మీ, వేసవిలో 78 మి.మీ అదనంగా వర్షపాతం నమోదవుతుంది

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతాల వారీగా ....

కోస్తా జిల్లాల్లో : 1078.0 మి.మీటర్లు

రాయలసీమలో : 714.0 మి.మీటర్లు

రుతుపవనాలే వర్షిస్తాయా!

రుతుపవనాలతో పాటే వర్షం వస్తుంది. నదులు నిండుగా పారుతాయి. చెరువులు నిండుతాయి. వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుంది. ఈ మార్పులన్నీ చూస్తే రుతుపవనాలే వర్షపు చినుకులుగా మారి పలకరిస్తాయనుకోవడం సహజం. అయితే, అది నిజం కాదు. నైరుతి, ఈశాన్య రుతపవనాల రాక, పోక కాలగమనంలో నిరంతరం చోటుచేసుకునే ఒక మార్పు మాత్రమే! ఈ రుతుపవనాలు వర్షాన్ని మోసుకొచ్చే మేఘమాలలు కావాలంటే అనేక అంశాలు కలిసి రావాలి. ప్రకృతి సహకరించాలి. లేని పక్షంలో రుతుపవనాలు సైతం ఎండమావులుగానే ఊరిస్తాయి. వర్షించని మేఘాలను చూసిన అనుభవం చాలా మందికి ఉండే ఉంటుంది. 'ఆకాశంలో మేఘాలను చూసి ముంత వలకబోసినట్లు...' సామెత గుర్తుండే ఉంటుంది. రుతుపవనాలు మోసుకొచ్చే గాలిలో నీరు ఉంటేనే వర్షం కురవడం సాధ్యమవుతుంది. సముద్రం మీదుగా వచ్చే రుతుపవనాలు సముద్రం నుండే నీటిని మోసుకురావాలి. అందుకు అనుగుణమైన వాతావరణ పరిస్థితులు అక్కడ ఉండాలి. సముద్రంలోని నీరు ఆవిరై మేఘాల్లోకి చేరి, సముద్రపు గాలికి చల్లబడి రుతుపవనాల గాలితో కలిసి భూమి మీదకు రావాలి. అలా వచ్చిన రుతుపవనాలే వర్షించడానికి సిద్ధంగా ఉంటాయి. అంతేకాదు, సముద్రం మీద నుండి భూమి మీదకు పయనం చేసిన గాలి ఒక ప్రాంతంలో అలానే ఉండదు. ఆకాశం దారులంట హడావిడిగా వెళ్లిపోతూనే ఉంటుంది. వాటిని బలంగా అడ్డుకుని వర్షాన్ని కురిపించే భౌగోళిక శక్తి కూడా కావాలి. ఇవ్వన్నీ కలిసివస్తేనే రుతుపవనాల ద్వారా వర్షం పొందడం సాధ్యమవుతుంది. అంటే, రుతుపవనాలు వాటంతట అవే వర్షించవని తేలిపోయినట్టే కాదా! భారత ఉపఖండం విషయానికి వస్తే సాధారణంగా రుతుపవనాలు వట్టి కుండలుగా రావు. భారతదేశానికి మూడు వైపులా ఉన్న బంగాళా ఖాతం, హిందూమహాసముద్రం, అరేబియా సముద్రాలు భారీ నీటి వనరులుగా ఉపయోగపడతాయి. వేసవి కాలంలో ఈ సముద్రాల నుండి పెద్ద మొత్తంలో నీరు గాలిలోకి చేరుతుంది. అక్కడి నుండి వీటి ప్రయాణం ప్రారంభమవుతుంది. ఆకాశంలో అందనంత ఎత్తులో పోతున్న వీటిని పశ్చిమ కనుమలు, హిమాలయాలు అడ్డుకుంటాయి. ఫలితంగా నైరుతి రుతుపవనాల సమయంలో వర్షం కురుస్తుంది. హిందూ మహాసముద్రంలో ప్రారంభమైన ఈ రుతపవనాలను పశ్చిమ తీరంలోనే విస్తరించి ఉన్న పశ్చిమ కనుమలు మొదట అడ్డుకుంటాయి. ఫలితంగా ఆ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తాయి. పశ్చిమ కనుమలను దాటి ముందుకు వెళ్లే రుతుపవనాలను హిమాలయాలు అడ్డుకుంటాయి. కేవలం అడ్డుకోవడమే కాకుండా నైరుతి రుతుపవనాల ద్వారా లభ్యమయ్యే మొత్తం వర్షాన్ని భారత ఉపఖండంలోనే కురిసేలా చూస్తాయి. ఉత్తర దిక్కున హిమాలయాలే లేకుంటే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. నైరుతి రుతుపవనాలు భారతదేశంలో వర్షించకుండానే టిబెట్, ఆఫ్ఘనిస్తాన్, రష్యా వంటి దేశాల వైపు వెళ్లిపోయేవి. నైరుతి రుతుపవనాలను కరిగించి వర్షపు చినుకులను కురిపించే బాధ్యతను పశ్చిమ కనుమలు హిమాలయాలు తీసుకుంటే, ఈశాన్య రుతుపవనాలను తూర్పు కనుమలు అడ్డుకుంటాయి.

ఇది సాధారణం!

సాధారణంగా నైరుతి రుతు పవనాలు మే నెలాఖరు లేదా జూన్ ఒకటవ తేది నాటికి భారత పశ్చిమ తీర ప్రాంతమైన కేరళలోకి ప్రవేశిస్తాయి. జులై 15వ తేది నాటికి ఇవి దేశమంతా విస్తరిస్తాయి, సెప్టెంబర్ ఒకటి నుండి, అక్టోబర్ ఒకటవ తేది నాటికి వీటి ప్రభావం దాదాపుగా ముగుస్తుంది. ఈశాన్య రుతుపవనాలు సాధారణంగా అక్టోబర్ 20వ తేదిన దేశంలోకి ప్రవేశిస్తాయి. 50 రోజుల పాటు వీటి ప్రభావం ఉంటుంది. అయితే, ప్రతి రుతుపవనాల సీజన్‌లోనూ ఒకే మాదిరి వర్షపాతం నమోదు కాదు. కొన్ని సంవత్సరాల వర్షపు లెక్కలను ఆధారంగా వాతావరణ శాఖ సాధారణ వర్షపాతాన్ని గణిస్తుంది. ఒక రుతుపవనాల కాలంలో ఆ మేరకు వర్షం కురిస్తే సాధారణ వర్షపాతం నమోదైనట్టు భావిస్తారు. అంతకన్నా ఎక్కువ వర్షపాతం కురిస్తే భారీ వరదలు ముంచెత్తుతాయి. తక్కువ వర్షపాతం నమోదైన సంవత్సరాల్లో కరువు కాటకాలు వెంటాడుతాయి. వర్షపాతం ఎక్కువైనా, తక్కువైనా దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది.

అసాధారణమే అధికం!

గత దశాబ్దకాలంలో భారతదేశంలో రుతువపనాల స్వరూపమే మారిపోయింది. అసాధారణ వర్షాలు ముంచెత్తుతున్నాయి. అతి తక్కువ రోజుల్లో అత్యధిక వర్షపాతాలు నమోదవుతున్న సంవత్సరాల సంఖ్య పెరుగుతోంది. ముంబాయి వరదల నుండి 2009లో కర్నూలు నగరాన్ని ముంచెత్తిన వరదల వరకు ఈ తరహా వర్షాలే కారణం. ఇటువంటి సంఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోవడం ఆందోళన కరంగా మారుతోంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు ఈ పరిస్థితికి కారణమని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

అంచనా సులభమేం కాదు ...

రుతుపవనాల కదలిక, వాటి ద్వారా లభించే వర్షపాతం అంచనా వేయడం అంత సులభమే కాదు. భిన్న వాతావరణ పరిస్థితులు ఉన్న భారత ఉపఖండంలో రుతుపవనాల అంచనా మరింత క్లిష్టతరం. వాతావరణ శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం భారత ఉపఖండంలో రుతుపవనాల ప్రభావాన్ని పాక్షికంగా చెప్పడమే సాధ్యమవుతుంది. కచ్చితంగా నిర్ధారించడం చాలా కష్టం! ఈ నేపథ్యంలోనే భారత ఉపఖండంలో రుతుపవనాల అధ్యయనానికి సంబంధించి అనేక సిద్ధాంతాలు రూపొందాయి. సాంప్రదాయ సిద్ధాంతం, డైనమిక్ థీరీ, జెట్‌స్ట్రీమ్ థీరీ ఇలా అనేక

పేర్లతో అధ్యయనాలు కొనసాగుతున్నాయి. ఒకవైపు మంచు పర్వతాలు, మూడువైపులా సముద్రం, ఎడారి ప్రాంతం కలిసి ఉన్న భారత దేశంలో కచ్చితంగా రుతుపవనాల ప్రభావాన్ని అంచనా వేయడం కష్టతరంగా మారుతోంది.

ఎల్‌నినో ప్రభావం

రుతుపవనాలపై ప్రభావం చూపే అంశాల్లో ఎల్‌నినో ఒకటి. పసిఫిక్ మహాసముద్ర జలాల ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పుల కారణంగా ఎల్‌నినో ఏర్పడుతుంది. సాధారణ ఉష్ణోగ్రత కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతకు చేరుకున్న మధ్య – తూర్పు పసిఫిక్ జలాలు మిగిలిన సముద్ర ప్రాంతానికి విస్తరించడం ఎల్‌నినోకు కారణం. ఈ వేడి నీటి ప్రవాహం సాధారణంగా సముద్రంపైన ఉన్న గాలిలోకి నీరు చేరే ప్రక్రియను అడ్డుకుంటుంది. ఫలితంగా పలు దేశాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతాయి. ఎల్‌నినో సమయంలో భారత ఉపఖండంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతాయి. కరువులు కూడా ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. వాతావరణ పరిశోధకులు వెల్లడించిన వివరాల ప్రకారం మధ్య–తూర్పు పసిఫిక్ సముద్రంలో మూడు నెలల సాధారణ ఉష్ణోగ్రతకన్నా 0.5 సెల్సియస్ డిగ్రీల మేర అదనపు ఉష్ణోగ్రత చేరినప్పుడు ఎల్‌నినో ఏర్పడుతుంది. సాధారణంగా రెండు సంవత్సరాల నుండి ఏడు సంవత్సరాల వ్యవధిలో ఎల్‌నినో ఏర్పడుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. సగటున ప్రతి నాలుగు సంవత్సరాల కోసారి ఎల్‌నినో ప్రభావం రుతుపవనాలపై కనపడుతోంది.

ఎలా గుర్తిస్తారు ?

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పాటు కావడాన్ని గుర్తించడానికి శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సముద్ర జలాలపై నిరంతరం పరిశోధన సాగిస్తూఉంటారు. సముద్రపు నీటి ప్రవాహంలో వేగం తగ్గడం ఎల్‌నినో ఏర్పడుతుందనడానికి గుడ్డి గుర్తని శాస్త్రవేత్తలు చెబుతారు. దీంతో పాటు హిందూ మహాసముద్రంలోని ఉపరితల నీటిలో ఒత్తిడి పెరగడం, ఇండోనేషియా, ఆస్ట్రేలియా తీరాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొనడం, తహితీతో పాటు తూర్పు పసిఫిక్ మహాసముద్రంపైన గాలిలో ఒత్తిడి తగ్గడం, దక్షిణ మహా సముద్రంపైనుండి వీచే గాలులు బలహీన పడటం, పెరూ ప్రాంతంలో వేడిగాలులు వీచడం, ఉత్తర పెరూవియన్ ఎడారుల్లో వర్షం పడటం కూడా ఎల్‌నినోను ధృవీకరిస్తుంది. నెలల తరబడి ఎల్‌నినో కొనసాగితే సముద్రపు జలాల ఉష్ణోగ్రత గణనీయంగా పెరిగి మత్స్యసంపదపై కూడా ప్రభావం చూపుతుంది.

ఏయే దేశాల్లో ఎలా ...!

ఎల్‌నినో ఒక్కో దేశంపై ఒక్కో రకమైన ప్రభావం చూపుతోంది. భారతదేశంలో తీవ్రమైన కరువు పరిస్థితులకు ఎల్‌నినో దారితీస్తుండగా దక్షిణ అమెరికాలోని పశ్చిమతీర ప్రాంతంలో భారీ వర్షపాతం నమోదవుతోంది. ఏప్రిల్, అక్టోబర్ నెలల్లో ఏర్పడే ఎల్‌నినోతో పెరూ, ఈక్వెడార్‌లో వరదలు వస్తున్నాయి. అంటార్కిటా ప్రాంతంలో మంచు భారీగా కరుగుతుంది.

ఈ సంవత్సరం ఎల్‌నినో ముప్పు...?

2015 సంవత్సరంలో ఎల్‌నినో ముప్పు పొంచి ఉందా? శాస్త్రవేత్తలు అదే అంటున్నారు. జపాన్‌లోని వాతావరణ పరిశోధన కేంద్రం 2014లోనే ఈ మేరకు హెచ్చరికలు జారీ చేసింది. తాజాగా ఆస్ట్రేలియన్ వాతావరణ శాఖతో పాటు, ప్రపంచ వాతావరణ అధ్యయన కేంద్రం కూడా ఇదే హెచ్చరికలు చేశాయి. ఈ ఏడాది జూన్‌లోగా ఎల్‌నినో ఏర్పడే అవకాశం ఉందని ఈ హెచ్చరికల సారాంశం. దీనికి తగ్గట్టుగానే భారత వాతావరణ శాఖ విడుదల చేసిన అంచనాల్లో రుతుపవనాలు సకాలంలో వచ్చినప్పటికీ, సాధారణ వర్షపాతం ఉండే అవకాశం తక్కువే అని అంచనా వేసింది.

లా నినా ..

ఎల్‌నినోకు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు సముద్రజలాల్లో ఏర్పడటాన్ని లా నినాగా పేర్కొంటున్నారు. ఎల్‌నినోలో సముద్ర నీటి ఉష్ణోగ్రత సాధారణం కన్నా పెరిగితే, లా నినా సమయంలో సాధారణం కన్నా తగ్గుతాయి. ఎల్‌నినో, లా నినాలను కలిపి ఎల్‌నినో సదరన్ ఆస్కిలేషన్ సర్కిల్ (ఇఎన్ఎస్ఓ)గా పిలుస్తున్నారు. ఎల్‌నినో, లానినాలు ప్రపంచవ్యాప్తంగా వర్షపాతాల్లో హెచ్చుతగ్గులకు కారణమవుతున్నాయి.

భూ తాపం పెరగడమే కారణమా

భూ తాపం అనూహ్యంగా పెరగడమే సముద్రజలాల ఉష్ణోగ్రతలో భారీ మార్పులకు కారణమని పర్యావరణ శాస్త్రవేత్తలు తేల్చారు. విచ్చల విడిగా సాగుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో భూమిపై కర్బన ఉద్గారాలు పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. ఫలితంగా భూ వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సముద్ర జలాల ఉష్ణోగ్రతల మార్పులకు కూడా ఇదే కారణమని శాస్త్రవేత్తల నిర్ధారణ.తొలకరి చినుకు నేల మీద రాలడానికి ఇంత పెద్ద కథ వుంది మరి.

మరికొన్ని రుతుపవనాలు

రుతుపవనాల కదలికలను తెలిపే చిత్రం

నైరుతి, ఈశాన్య రుతుపవనాల కాకుండా ఆసియన్–ఆస్ట్రేలియన్ రుతు పవనాలు కూడా భారతదేశంపై స్వల్ప ప్రభావం చూపుతాయి. పసిఫిక్ మహాసముద్రంలో ప్రారంభమై రష్యా, ఆస్ట్రేలియా మీదుగా హిందూ మహాసముద్రం వరకు ఈ రుతుపవనాలు ప్రయాణం చేస్తాయి. దీని ప్రయాణం ఆఫ్రికా తీర ప్రాంతంలో అంతమవుతుంది. మధ్య వేసవి కాలంలో ఏర్పడే ఉత్తర అమెరికన్ రుతుపవనాలు కూడా ముఖ్యమైనవే! కాలిఫోర్నియా, మెక్సికో ప్రాంతాల నుండి వీచే గాలులు మెక్సికోలోని సిరియా ప్రాంతంలో కలుసుకుని రుతుపవనాలుగా మారుతాయి. అట్లాంటిక్ మహాసముద్రంలో ఏర్పడే చల్లటి గాలులు సహారా ఏడారి మీదగా ప్రయాణం చేయడంతో ఆఫ్రికాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. తూర్పు ఆసియా రుతుపవనాల కారణంగా చైనా, ఫిలిప్పైన్స్, కొరియా, జపాన్‌లలో వర్షపాతం నమోదవుతోంది. అట్లాంటిక్ మహాసముద్రంలో ఏర్పడే యూరోపియన్ రుతుపవాలు కూడా ముఖ్యమైనవే! మార్చి నెలలో ఏర్పడే ఈ రుతుపవనాల ప్రభావం మే దాకా ఉంటుంది. అయితే, జూన్‌లో ఇవి తిరిగి పుంజుకుని వర్షిస్తాయి.

ఎడ్ల బండి

దాట్ల దేవదానం రాజు
-9440105987

సిపిఎం జాతీయ మహాసభల సందర్భంగా జరిపిన కథల పోటీలో ప్రచురణకు ఎంపికైన కథ

బహుశా మీకు ఒడలు బండ్లవడం గురించి తెలిసే ఉంటుంది. అలాగే బండ్లు ఒడలుగా కూడా.అయితే ఎడ్ల బళ్ల ఉద్యమం బాట పట్టి సమ్మె చేయడం గురించి మీకు తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే అది మా ఊళ్ళో జరిగింది.

బళ్ల వెనుక మనుషులున్నారు. జీవితాలున్నాయి. తరాతరాల బతుకులున్నాయి. అదొక్కటీ తెలుసుంటే మీరు కథ చదవడానికి అర్హులే. ఆలస్యమెందుకు? పదండి ముందుకు...

చెట్టు నీడ. ఎడ్ల బండి చక్రం ఊడదీసి బలమైన రాటను జాకీలా మోపు చేశాడు కాసులు. తగువు తేలిపోతే బండిని రోడ్డెక్కించాలని నార ఎక్కించే పని పెట్టుకున్నాడు. సుబ్బడు సాయంగా ఉన్నాడు.

కాసులు చెమటతో తడిసి ముద్దయ్యాడు. ఒడుపుగా మధ్య మధ్య లో ఆముదం పోస్తూ బండి ఇరుసుకు జనపనారను గట్టిగా చుడుతున్నాడు. ఆముదం వాసన. చిత్రమైన కంపు. ముఖానికి వేడి గాడ్పు కొడుతున్నది.

చేతి కర్ర ఊతంతో ఆయాసపడుతూ సత్యం వచ్చాడు. ఎడ్ల బండి తోలుకుంటూ కిరాణా సరకులు రవాణా చేయడంతోనే అతని జీవితకాలమంతా గడిచిపోయింది. సాదక బాధకాలు బాగా ఎరిగినవాడు. ఇప్పుడు కొడుకును అదే పనిలో దింపి తను తప్పుకున్నాడు. ఎద్దుల మనసు చదివినవాడు.

"ఈ సందేళ కూచుని ఏదో కాసేపు ముచ్చట్లాడేసుకుని, సీకటడింతర్వాత తాగి తొంగుంటే సరిపోదు. పొద్దుట సద్ది ముద్దవేళ అందరూ బండ్లు కట్టుకుని దొరగారి బంగ్లాకి చేరిపోవాలి. అందరూ కనకాలపేట వాళ్ళే గనుక ఒకళ్లనొకళ్ళు హెచ్చరిక చేసుకుని బయలెల్లాలి. అటో ఇటో తేల్చేద్దాం.. నాయాల కుటుంబాల్లోని చిన్నాచితకా అందర్నీ బీరుపోకుండా బండ్లు ఎక్కించుకుని వెళ్లిపోవాలి. మన బలం ఏపాటిదో ఎరుక పర్చాలి. ఆ తర్వాత జగన్నాథం బాబున్నాడు... ఆయనే అన్నీ చూసుకుంటాడు. ఆ పైన దేవుడున్నాడు.." నేల మీద పడి వున్న దుంగపై కూర్చుని అన్నాడు సత్యం.

"దేవుడుండాడా? ఉంటే ఈ బతుకు నలుగుడు కట్టాలేంటి?" కాసులు అన్నాడు. నిక్కరు జేబులోంచి జాగ్రత్తగా వేళ్ళతో చుట్ట తీసి నోట్లో పెట్టుకున్నాడు. చేతుల నిండా మసి. సుబ్బడు అగ్గిపుల్లతో వెలిగించాడు. కాసులు దమ్ము లాగాడు. ఓసారి బండికేసి చూశాడు. అతని చూపు గ్రహించాడు సత్యం.

"ఏ మాత్రం పెట్టావేంటి? " సత్యం అడిగాడు.

"ఈ బండికి పెట్టిన పెట్టుబడికి నానా సంకలు నాకాను. ఈ మోస్తరు తయారు కావడానికి డబ్బులకి రెక్కలొచ్చాయనుకో. గుడ్డి నమ్మకంతో అప్పుచేసి, మళ్ళీ..ఇట్టంగానే అనుకో.. వాళ్ళు తెలవకుండా బాగు చేసి ఈ కాడకి తీసుకొచ్చాను. అంతా కొత్త బండికి చేసినట్లే. నువ్వే చూడు... చక్రానికి ఆకులు.. పూటీలు.. ఇనుప పట్టా.. అన్నీ మార్చేశాను. డబ్బులు ఖర్చైపోబట్టి గానీ పోలికర్ర కూడా మార్చేద్దును. ఏనాటిదో అది. అక్కడక్కడ చిట్లింది, మరో దఫా చూద్దాం లే అనుకుని..." అన్నాడు కాసులు.

సుబ్బడు ఆముదం సీసా తన్నేశాడు... సన్నని ధారతో వాలికి పోతోంది.

"ఎదవ నాయాల...తిన్నగా చూసి అడుగెయ్యలేవా?" అంటూ సత్యం గదమాయించాడు.

"ఒరేయ్ కాసులూ ... ఇందాక చూసాను. ఎద్దులకు మెత్తగాళ్ళు పడినట్లున్నాయేంటి?"

" అవును.. రేపు ఈ గొడవ తేలిం తర్వాత నాడాలు ఏయించాలి. ముగ్గురు మనుషులుంటే గానీ పనవ్వదు. ఎద్దుని పడగొట్టాలి. డెక్కల మీద నాడాలు కొట్టాలి. ఎద్దుకు వంద కొడితే గానీ నాడాలేసేవాడు వొప్పడం లేదు." అన్నాడు

కాసులు. "కానీ మాత్రం, ఒరేయ్! ఏ మాటకామాట సెప్పుకోవాలి. మన కనకాల పేటలో బండినీ, ఎద్దుల్నీ నీ అంత కుశాలంగా చూసుకునేవాడు లేడు రా. తొట్టె గెడల మధ్య మేకుతో బిగించిన పడకదిన్నె అదిరందనుకో. ఎద్దులకు రంగుల దారాలతో కట్టిన మువ్వలు, నగిషీల చిడతలు, సొంపుగా ఒసికర్రల మధ్య అల్లిన ఎదురు తడికలు మంచి కుదురుగా వాటంగా అమరాయి. సోగ్గాడి బండిలా ఇంపుగా గూడు.. దాని పైన నల్లటి టార్పాలిన్.. అందుకే కాసులుగాడి బండి చూసి అందరూ ఉడుక్కుంటారు. కుళ్ళి చస్తారు." సత్యం పొగిడాడు.

"ఏమిటో పిట్టను కొట్ట పొయ్యిలో పెట్ట... అన్నట్టుంది బతుకు. మా జయవిజయుల కడుపు నింపేటప్పటికి తల తోకకు వత్తున్నాది.

ఉలవలు, గంట్లు, తవుడుతో ఉడకపెట్టిన దాణా తడిసి మోపిడవుతున్నాది. గుర్రం గుడ్డిదైన దాణా తప్పదన్నట్లు... పనున్నా లేకపోయినా తిండి తప్పదు కదా. పైగా మా నేస్తాలకు కాకినాడ వెళ్ళొస్తే చాలు వేడినీళ్ల కాపడం పెట్టాలి." కాసులు అన్నాడు.

"నువ్వు అలా అలవాటు చేసావు... సరేలే, నేనొత్తాను. రేపొద్దును ఎలాగూ వుంది కదా రగడ. సూద్దాం! గవర్నమెంటోడు దిగొత్తాడో లేదో?" సత్యం లేచి నిలబడ్డాడు, వెళ్లడానికి సిద్ధపడుతూ.తెల్లారింది. సముద్రం మూల సూర్యుడు ఎర్రగా కందిపోయి పెద్దగా కనిపిస్తున్నాడు. గోదారి మీంచి చల్లటి గాలి రివ్వుమని కొడుతూంది. లంకల్లోంచి పాలు పితుక్కుని వచ్చేవాళ్ళూ, న్యూస్ పేపర్లు పంచే కుర్రాళ్ళూ, ముసుగులు తొడుక్కుని నడకే ఆరోగ్యరహస్యమని చిరుచెమటలతో నడిచే వాళ్ళూ, ఇళ్ల ముందు కళ్ళాపు జల్లుకుని ముగ్గులేసుకునే ఆడాళ్లూ, వీపులకు బ్యాటులు తగిలించుకుని మోటారు వాహనాల మీద ఇండోర్ స్టేడియంకు వెళ్ళేవాళ్ళూ, కురచ ఖాకీ నిక్కర్లతో కవాతులు చేస్తున్న ఆరెస్సెస్ వాళ్ళూ, సైరన్ మోత వినిపించగానే వడివడిగా పిరమిడ్ మందిరానికి పరుగులు పెట్టేవాళ్లూ... అంతటా సుందర తేట హృదయాల పసందైన ఉదయపు కోలాహలం.

ఎడ్లబండ్లు సాఫీగా బహు నెమ్మదిగా రోడ్డు మీద బారులు తీరి వస్తున్నాయి. గిట్టల శబ్దం లేదు. కొరడా ఝుళిపింపులు లేవు. అదలింపులు లేవు. ముందు బండి దారి చూపుతుంటే మిగిలినవి అనుసరిస్తున్నాయి. విషయమేమిటో తెలియని జనం వింతగా చూస్తున్నారు.

దొరగారి బంగ్లా చేరాయి. ఆ బంగ్లాలో యానాంలోని సమస్త ప్రభుత్వ శాఖలకు ముఖ్య అధికారి ఉంటాడు. ఆయన్ని ప్రాంతీయ పరిపాలనాధికారి అంటారు.

బంగ్లా చుట్టూ రెండు వరుసలలో బండ్లను నిలిపారు. ఎడ్లను బండ్లకు కట్టేశారు. కాడి దగ్గర తొట్టిలో బండి లోంచి ఎండు గడ్డి తీసుకొచ్చి వేశారు. తోకలూపుకుంటూ ఆత్రంగా గడ్డిని అందుకుంటున్నాయి.

ఇంతలో జగన్నాథం వచ్చాడు. తెల్లని ఛాయ. అందంగా పెరిగిన చిరుగెడ్డం. కళ్ళల్లో మెరుపు. ఇప్పుడిప్పుడే రాజకీయాల్లోకి వస్తున్నాడు. నలభై ఏళ్ల వయసు. ప్రజా సమస్యల పట్ల స్పందించి ప్రజల్ని ఆకట్టుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

"నేను చెప్పేంత వరకూ మీరిక్కడే ఉండండి" అంటూ లోపలికి వెళ్ళాడు జగన్నాథం.

అరగంటయ్యింది. ఏ కబురూ లేదు. బళ్ళ వారందరూ గుంపుగా చేరి కబుర్లలో పడ్డారు.

" ఏం జరుగుతుందో లోపల?"

"పని అవుతుందంటావా!"

"ఇంకా ఎంతసేపు..."

"ఆఫీసరు గార్కి మన బాధ అర్థం చేసుకోవాలా? ఆ పైన పాండిచేది వాళ్ళతో మాట్లాడాలా? ఊరికే కంగారుపడితే ఎలా?"

"ఆఫీసరు గారు లేరంట. గుడికెళ్లారంట. ఆయన రావాలి. అప్పుడు దాకా అంతే."

అసలు విషయం తెలిసింది. రకరకాల వ్యాఖ్యానాలు.

"అక్కడ్నుంచి అటే ఏ కాకినాడకో చెక్కేసాడేమో. జగన్నాథం బాబు ప్రతిపక్షం వాడు కదా, ఆయనకు పేరొస్తే ఎలా? పై నుంచి సంకేతాలు అందుంటాయి." ఊళ్ళో జరిగే ప్రతి సంఘటననూ రాజకీయాలకు ముడి పెట్టి మాట్లాడేవాడొకడు అంటున్నాడు. జగన్నాథం వచ్చాడు. కోపంతో ఆయన ముఖం మరింత ఎర్రబారింది. ఆవేశం రగులుకున్న మనిషిలా ఉన్నాడు. "మన దెబ్బకు జడిసినట్లున్నాడు. ఫోన్‌లో మాట్లాడితే సాయంత్రం రమ్మంటున్నాడు. కనీసం మనం చెప్పే విషయాలు వినకపోవడం దారుణం. ఓ గంట చూద్దాం. అప్పుడే ఆలోచిద్దాం ఏం చేయాలో?" జగన్నాథం పైమెట్టు మీద నిలబడి బళ్ళ వాళ్ళందరికీ వినపడేలా గట్టిగా అన్నాడు. వాళ్ళ ఉత్సాహం నీరు గారింది. ఏదో రకంగా తేలిపోతుందనే నమ్మకం సన్నగిల్లింది. అనుకున్న సమయం గడిచింది. అంతా అసహనంగా ఎదురు చూస్తున్నారు.

అప్పటికే జగన్నాథం ఒక నిర్ణయం తీసేసుకున్నాడు. అందర్నీ దగ్గరకు రమ్మని పిలిచాడు.

"పద్ధతి ప్రకారం ముందు రోజే మనం చేయబోయే నిరసన గురించి తెలియజేసాం. దీనికి పెద్దగా ఆలోచించక్కర్లేదు. వాళ్ళు కావాలనే మనకు ఇంటర్వ్యూ ఇవ్వడం లేదు. ఎవరూ భయపడక్కర్లేదు. నేను చెప్పినట్టు చేయండి. ఎడ్లను బళ్ళ నుండి విప్పండి. జాగ్రత్తగా ఈ చిన్న మెట్ల గుండా ఆఫీసు గ్రౌండులోకి తోలుకు రండి. మనం తెగించకపోతే లాభం లేదు.

ఊ...కానీయండి."

జగన్నాథం ఆదేశించగానే పొలోమని ఎద్దుల్ని ఆఫీసు ఎదురు ఖాళీ ప్రదేశంలోకి వదిలేశారు. అవి కదను తొక్కాయి. పూల మొక్కల్ని ధ్వంసం చేశాయి. కనకాంబరాలు, చేమంతులు, బంతిపూలు, గులాబీలు, క్రోటన్సు, సన్నజాజులు... అన్నింటినీ తొక్కి పారేశాయి. ఆ ప్రాంతమంతా పేడతో ఖరాబు అయ్యింది. ఎవరూ ఊహించలేదు.

ఉద్యోగులు బయటకు రాలేదు. చక్కగా తీర్చిదిద్దినట్లు పెంచుతున్న పూలవనం నిమిషంలో బోడిగా మారిపోయింది. అప్పుడొచ్చారు పోలీసులు. ఎద్దుల్ని బయటకు తోలడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది.

నిమిషాల్లో జగన్నాథం మరో నిర్ణయం తీసుకున్నాడు.టెంట్ వచ్చింది. కుర్చీలు వచ్చాయి. కుటుంబ సభ్యుల్ని అందులో కూర్చోబెట్టాడు. ఫ్లెక్సీలొచ్చాయి. నినాదాలు రాసిన ప్లకార్డులు

కాసులు ఎద్దు తన కొమ్ములతో పోలీసును పొడిచింది. బొక్క బోర్లా పడ్డాడు. లేచి నిలబడి బట్టలు దులుపుకుని అటూ ఇటూ చూశాడు. కాడి చిడత లాక్కుని ఎద్దుని కుమ్మడం మొదలెట్టాడు. అక్కడితో ఆ పోలీసు కోపం చల్లారలేదు. గబగబా బండెక్కి తడికలకు ఆధారమైన ఒసికొయ్య ఊడదీసి దిగ్గున కిందికి ఉరికాడు. ఎద్దుని బాదాడు. బాదాడు.. బాదాడు.. అలుపొచ్చేదాక. ఎద్దు అలాగే ఒళ్లప్పగించి నిలబడి ఉంది. కాసులు ముందుకు అడుగేసి పోలీసు చేతిలోని ఒసికొయ్యను పట్టుకుని ఆపాడు. ఇద్దరూ గింజుకుంటున్నారు. మిగిలిన వాళ్ళు విడదీయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ లోపులో జరగాల్సిన దారుణం జరిగిపోయింది. సంఘటనను అనుకోని మలుపు తిప్పింది.ఎద్దు సొమ్మసిల్లి పడిపోయింది. చలనం లేకుండా తల వాల్చేసింది. ప్రాణం గాలిలో కలిసిపోయింది.

నలుమూలలా పెట్టారు.

'పాండిచేరి ప్రభుత్వం ఆదుకోవాలి', 'తూ.గో జిల్లా కలెక్టరుతో మంతనాలు జరపాలి', 'ఎడ్ల బండ్ల మీదే ఆధారపడ్డ వారికి అండగా నిలవాలి', 'తూ.గో జిల్లా వాణిజ్య అధికారుల జులుం నశించాలి', 'మట్లపాలెం బళ్ళను అడ్డగించి సరుకులు దింపేసి ఎద్దుల్ని కట్టడిలోకి తీసుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి', 'కిరాణా సరకుల రవాణాను యథాప్రకారం కొనసాగించాలి'.. ఈ రాతల్ని చుట్టూ అంటించారు.

వాతావరణం మారిపోయింది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఉత్కంఠ పెరిగిపోయింది. పరిపాలనాధికారి సూర్యతేజ వచ్చారు. ఎవరినీ పలకరించకుండా లోపలికి వెళ్ళిపోయారు. చర్చలకు పిలవలేదు.

కాసేపటికి సూపరిండెంటు మరో గుమస్తా వచ్చారు."ఇది ప్రభుత్వ పరిధిలో పరిష్కరించే సమస్య కాదు. పరాయి రాష్ట్రం వారు తీసుకున్న నిర్ణయానికి మనం బాధ్యులం కాము." అని పరిపాలనాధికారి మాటగా చెప్పారు.

"నాయాలా! ఇప్పుడొచ్చాయా రూల్స్? జీవాలు మోసే సరుకులకు వే బిల్లులు కావాల్సి వచ్చిందా? మా కడుపులు కొట్టే అధికారం మీకెవ్వరిచ్చారు? వందల ఏళ్ల నుంచి లేనిది ఇప్పుడెందుకు? మా బతుకు నాశనం గురించి కలక్టేరుతో మాట్లాడడానికి మీకేమైనా నొప్పా? అయ్యా...బాబూ...మా పెజల బాధలు ఇవీ.. ఈటిని యదాపెకారం నడవనీయండి అని అడగలేరా? దొంగచాటున లచ్చల రూపాయిల దొడ్డి దారిన దాటి పోతూనే ఉంటాయి. నోటిమాట సాయం చేయడానికి ఇంత యాగీ చేసేత్తున్నారు. కలక్టేరు మంచి వాడంట. బతుకుల్ని వీధి పాలు చేయడానికి ఒప్పడంట. మరేం పోయేకాలం వచ్చింది మీకు?"పోలీసుల బలగం వచ్చేసింది. గుంపుని చెదరగొడ్తున్నారు. పరిస్థితి జగన్నాథం చేతుల్లోంచి ఎప్పుడో జారిపోయింది. ఉన్నట్టుండి కాసులు ఒక్కుదుటన ముందుకురికాడు.బండి కింద వేలాడుతున్న లాంతరును గట్టిగా లాగి చేతుల్లోకి తీసుకున్నాడు. మూత తీసి నెత్తి మీద పోసుకుని అగ్గిపుల్ల వెలిగించడానికి సిద్ధమై పోయాడు. అందరూ భయం భయంగా చూస్తున్నారు.



"కుదరదు. సూర్యతేజగారు స్వయంగా టెంటు దగ్గరకు రావాల్సిందే. మేం ఆయనతోనే మాట్లాడతాం."

మరో అరగంటలో సూర్యతేజ శిబిరం దగ్గరకు వచ్చారు. జగన్నాథం స్పష్టంగా చెప్పాడు.

"వీరంతా వారానికి ఒక రోజు అంటే ఆదివారం నాడు కాకినాడ వెళతారు. షావుకార్ల సరుకుల్ని కొనిబడి చేసి బళ్ళకు అప్పగిస్తారు. మంగళవారం పొద్దుటకు యానాం చేరతాయి. యానాం చుట్టు పక్కల గ్రామాలకు వీళ్ళే కిరాణా సామానులు తీసుకొస్తారు. ఇది ఇప్పుడు కొత్తగా మొదలయ్యింది కాదు. వందల ఏళ్ళ నాటి నుంచి జరుగుతున్న విధానం వీటికి మోటారు వెహికల్స్‌కి మల్లే వే బిల్లులేంటి? డబ్బులు లంచాలేమిటి? అవగాహన లేకుండా ఆంధ్రా వాళ్ళు చేస్తున్నారు. యానాంలో ముఖ్యంగా కనకాల పేటలో చాలా కుటుంబాలు ఇదే వృత్తిలో ఉన్నాయి. మానవతాదృష్టితో ఆలోచించి న్యాయం చేయమని కలెక్టరు గారికి మన ప్రభుత్వం తరుపున చెప్పుకుందాం. కోరదాం. వాళ్లు అంగీకరించకపోతే ఏం చేయాలో ఆలోచిద్దాం." అన్నాడు జగన్నాథం.

"పాండిచేరి అధికారులతో మాట్లాడి చెబుతాను.

ముందుగా మీరు ఈ ప్రాంతం ఖాళీ చేసి వెళ్ళిపోండి. ప్రశాంత వాతావరణం ఏర్పడాలంటే మీ సహకారం అవసరం. జగన్నాథం గారూ, నాక్కొంచెం సమయం ఇవ్వండి, దయచేసి అందర్నీ ఇక్కడ్నుంచి తీసుకుపోండి." అని సూర్యతేజ చెప్పి వెళ్ళిపోయాడు.

"ఆయన దగ్గర్నుంచి సరైన స్పందన వచ్చిందాక కదలొద్దు" అన్నాడు సత్యం.

"అలాగే..." అన్నాడు జగన్నాథం.

బండివాళ్ళ సమ్మె ప్రభావం అంత తేలిగ్గా తీసేయదగ్గది కాదని ఊళ్ళో వాళ్ళకు తెలుసు. కాకినాడ నుండి రావాల్సిన టోకుగా తీసుకున్న సరకులు నిలిచిపోతాయి. దాంతో ధరలు పెరిగిపోతాయి. అమ్మకందార్లు తమ దగ్గర ఉన్న నిత్యావసర వస్తువులను దాచి అమ్మడం మొదలెడతారు. పత్రికలు విరుచుకుపడతాయి. కోరింగ రేవు గుండా జల రవాణా చేసుకోవాల్సి వస్తుంది. దానికి మరల ఎలాంటి సమస్యలొ

స్తాయో తెలియదు. పరిస్థితి చక్కదిద్ద కపోతే మరింత గడ్డు కాలం దాపురిం చడం ఖాయమని అందరూ అనుకు న్నారు.

సాయంత్రమైంది...

ఆఫీసు ప్రాంగణం లోని మొక్కల్ని పాడు చేసి శాంతి భద్రతలకు భంగం కలిగించినందుకు శిబిరంలో ఉన్నవాళ్ల నోటీసులు అందుకున్నారు.

ఇంత దాకా వచ్చాక అరెస్టులకైనా సిద్ధపడక తప్పదని జగన్నాథం తెలియజేశాడు.

మచ్చికైన ఎద్దులు ఎంత గొప్పగా విశ్వాసాన్ని ప్రకటిస్తాయి? పోలీ సులు వాటిని బయటకు తోలేయగానే సుశిక్షు తులైన సేవకుల్లా తమ బండిని గుర్తించుకుని సరిగ్గా అక్కడకెళ్ళి నిలబడ్డాయి. వాటి క్రమశిక్షణ తీరు గొప్పది. యానాం నుండి కాకినాడ వెళ్ళేటపుడు గానీ, సరుకులు నింపుకుని తిరిగి యానాం వచ్చేటప్పుడు గానీ ప్రత్యేకంగా తోలనక్కర్లేదు. రోడ్డు ఎడమ పక్కన నిదానంగా నడుచుకుంటూ పోతాయి. బండివాడు నిండా సరుకులు సర్దుకుంటాడు. కాకినాడలో జనం సద్దుమణిగాక రాత్రి పదకొండు గంటలకు బళ్ళన్నింటినీ ప్రయాణానికి సిద్ధం చేస్తారు. అన్ని బళ్ళు ఒకేసారి బయలు దేరతాయి. ముందున్న బండివాడు ఎదర తొట్టె మీద పడుకుని ఎద్దుల్ని అదలిస్తాడు అంతే. ఇక వాటి గమనం సంగతి పట్టించుకోనక్కర్లేదు. ఆదమరచి నిద్రపోయినా ఇబ్బంది లేదు. చక్కగా నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ గమ్యం చేరుస్తాయి. ప్రతి బండి అడుగున ఇరుసు మధ్యగా కిరోసిన్ లాంతరు వెలిగించి వేలాడదీస్తారు. అది అటూ ఇటూ ఊగుతూ వుంటుంది. లారీలు, బస్సులు దూరం నుంచే వెలుగును బట్టి బళ్ళను గుర్తించడం వల్ల చీకటి రాత్రుల్లో కూడ ప్రమాదాలు జరిగే అవకాశం లేదు.

ఏమైంది అక్కడ? ఏదో గలాభా జరుగుతున్నట్టుంది?

కాసులు ఎద్దు తన కొమ్ములతో పోలీసును పొడిచింది. బొక్క బోర్లా పడ్డాడు. లేచి నిలబడి బట్టలు దులుపుకుని అటూ ఇటూ చూశాడు. కాడి చిడత లాక్కుని ఎద్దుని కుమ్మడం మొదలెట్టాడు. అక్కడితో ఆ పోలీసు కోపం చల్లారలేదు. గబగబా బండెక్కి తడికలకు ఆధారమైన ఒసికొయ్య ఊడదీసి దిగ్గున కిందికి ఉరికాడు. ఎద్దుని బాదాడు. బాదాడు.. బాదాడు.. అలుపొచ్చేదాక. ఎద్దు అలాగే ఒళ్ళప్పగించి నిలబడి ఉంది. కాసులు ముందుకు అడుగేసి పోలీసు చేతిలోని ఒసికొయ్యను పట్టుకుని ఆపాడు. ఇద్దరూ గింజుకుంటున్నారు. మిగిలిన్న వాళ్ళు విడదీయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ లోపులో జరగాల్సిన దారుణం జరిగిపోయింది. సంఘటనను అనుకోని మలుపు తిప్పింది.ఎద్దు సొమ్మసిల్లి పడిపోయింది. చలనం లేకుండా తల వాల్చేసింది. ప్రాణం గాలిలో కలిసిపోయింది.

ఇక కాసులు వీరంగం చేశాడు. పిచ్చెక్కినట్లు అరుపులు కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. జనం పోగుపడిపోయారు. తనొక కర్ర తీసుకున్నాడు. మెట్లెక్కి ఆఫీసు కిటికీ వైపుకు విసిరాడు. అద్దం భళ్ళున బద్దలయ్యింది. రోడ్డు మీద పేడ తీసుకుని దొరగారి బంగ్లా గోడకేసి కొట్టాడు. చేతుల్లోకి తీసుకుంటున్న పేడను అలా విసురుతూనే ఉన్నాడు. అతనికి మరో ఇద్దరు తోడయ్యారు. రాళ్ల, పేడ విరజిమ్ముతూనే ఉన్నారు. జగన్నాథం నిశ్చేష్టుడై చూడటం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయుడుగా నిలబడిపోయాడు.

"ఒరేయ్! కనకాల పేట వాళ్ల పౌరుషానికి పెట్టింది పేరని తెలియదా? అగ్గి రాజేస్తే ఇక ఆరదు రా..! తాతల నాటి నుండీ ఇదే పని చేస్తున్నాం. ఇదే బతుకు తెరువుగా గడుపుతున్నాం. ఒక్కపక్క ఏడ్వ గలిగేవాడే ఎగసాయం చేత్తున్నాడు. కొద్దిపాటి కొంప్రకు వేడినీళ్ళుకు చన్నీళ్లని ఈ బండి తోలుకుని మేం చేస్తున్నాం. సవా లచ్చ రూల్స్ అడ్డంగా పెట్టి కాల్చుకు తింటున్నారు." ఎగిరెగిరిరి పడుతూ అరుస్తున్నాడు కాసులు.

తువ్వాలు మెడ చుట్టుకుంటూ– "ఆవు ఎంతో ఎద్దూ అంతే. అది పాలు ఇత్తుంది. ఇది బతుకు ఈడుత్తుంది. ఈయేళ అత్తారబత్తంగా చంటిపిల్లాడిలా పెంచుకునే నా జయుడ్ని పొట్టన పెట్టుకున్నారు. అంటేనన్ను సంపినట్లే. జయుడు లేకపోతే విజయుడు లేడు. వీళ్ళిద్దరూ లేకపోతే ఈ కాసులు గాడు లేడు. నన్ను కూడా సంపి ఆటితో నన్నూ తగలెయ్యండి." అంటూ ఒంటి మీది బనీను చింపుకుని గుండెను చూపిస్తున్నాడు. వాళ్ళలో ఒకడు కాసుల్ని గట్టిగా పట్టుకున్నాడు. విదిలించుకున్నాడు.

"నాయాలా! ఇప్పుడొచ్చాయా రూల్స్? జీవాలు మోసే సరుకులకు వే బిల్లులు కావాల్సి వచ్చిందా? మా కడుపులు కొట్టే అధికారం మీకెవ్వరిచ్చారు? వందల ఏళ్ళ నుంచి లేనిది ఇప్పుడెందుకు? మా బతుకు నాశనం గురించి కలక్టేరుతో మాట్లాడడానికి మీకేమైనా నొప్పా? అయ్యా...బాబూ...మా పెజల బాధలు ఇవీ.. ఈటిని యదాపెకారం నడవనీయండి అని అడగలేరా? దొంగచాటున లచ్చల రూపాయిల దొడ్డి దారిన దాటి పోతూనే ఉంటాయి. నోటిమాట సాయం చేయడానికి ఇంత యాగీ చేసేత్తున్నారు. కలక్టేరు మంచి వాడంట. బతుకుల్ని వీధి పాలు చేయడానికి ఒప్పడంట. మరేం పోయేకాలం వచ్చింది మీకు?"

పోలీసుల బలగం వచ్చేసింది. గుంపుని చెదరగొడ్తున్నారు. పరిస్థితి జగన్నాథం చేతుల్లోంచి ఎప్పుడో జారిపోయింది. ఉన్నట్టుండి కాసులు ఒక్కుదుటన ముందుకురికాడు. బండి కింద వేలాడుతున్న లాంతరును గట్టిగా లాగి చేతుల్లోకి తీసుకున్నాడు. మూత తీసి నెత్తి మీద పోసుకుని అగ్గిపుల్ల వెలిగించడానికి సిద్ధమై పోయాడు. అందరూ భయం భయంగా చూస్తున్నారు.

"ఎవరూ దగ్గరకు రాకండి. వస్తే నేనేం చేత్తానో నాకు తెలియదు. ఎద్దులు పోయాక నేనెందుకు నా బండెందుకు?" "ఏయ్ ..కాసులు.. ఎలాంటి పిచ్చిపనులు చేయకు. నీ వెనకాతల పెళ్లాం పిల్లలు ఉన్నారు. అనవసర రాద్ధాంతం చేయకు. తొందరపడితే నష్టపోయేది నీవే..." జగన్నాథం మాటలు ఇంకా పూర్తి కాలేదు.

లాంతరు లోంచి కిరసనాయిలు బండి మధ్యలో ఉన్న గడ్డి మీదపోశాడు. అగ్గిపుల్ల వెలిగించి విసిరాడు. భగ్గుమంది. క్షణంలో సగం మంటలు ఎగిశాయి. వెదురు తడికలు, పడక దిన్నె, తాళ్ళు, కాడి పైకప్పు మీది టార్పాలిన్ అంటుకుంటే ఆర్పడం ఎవరి తరమూ కాదు. అంటుకుంది... అందుకే ఉవ్వెత్తున మంటలు. కాసులు అపురూపంగా చూసుకునే బండి కళ్ళెదుట అగ్గిపాలవుతున్నది. ఎద్దు చనిపోయింది. పిచ్చెక్కినవాడిలా బండి చుట్టూ తిరుగుతున్నాడు. మంట తాలుకు అగ్ని కీలలు కాసుల్నీ తాకుతున్నాయి. అయినా లెక్క చేయకుండా మంట ఎగదోయడానికి, వద్దంటున్నా వినకుండా పక్క బండి లోంచి గడ్డి తీసుకొచ్చి వేస్తున్నాడు. చీకటి తెరల మధ్య ఎవరేం చేస్తున్నారో తెలియడం లేదు. వాతావరణమంతా ఆడాళ్ళ రోదనలతో గందరగోళంగా తయారయ్యింది. మంట అంతకంతకూ పెరిగిపోతోంది.

జనం నీళ్ల కోసం పరుగులెట్టారు. ఈ లోపులో జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. మిగిలిన బళ్ళను దూరంగా తీసుకుపోయారు.

ఆ మంటలు చూస్తూ కాసులు నేల మీద చతికిలపడిపోయాడు. కళ్ళు మూసుకుని ఏడవడం మొదలెట్టాడు. అప్పటికే కాసులు చేతులు కాలాయి. బట్టలు అంటుకున్నాయి. ఆర్పేశారు. వెంటనే కాసుల్ని ఆసుపత్రికి తీసుకునిపోయారు. అక్కడితో, ఆ రోజుతో నిరసనలు ఆగిపోలేదు. కారణాలేమైతేనేం వారం రోజుల పాటు సాగాయి.

ఉద్యమాలు, పోరాటాల త్యాగం ఊరికే పోదు. కలకాలం చెప్పుకునే గాథగా మారుతుంది. తరతరాలకు ఒక స్ఫూర్తిగా నిలిచిపోతుంది. జెండా తొలిసారి పాతిన వారి పేరు చరిత్ర పుటలలో ఎప్పటికీ ఉండిపోతుంది. పరిపాలకులు దిగి రాక తప్పదు.

ఆలస్యంగా నైనా కాసులు త్యాగం కూడ ఊరికే పోలేదు.

✦

చుక్కలు కలపండి



నోమ్ తోటమాలి

అందమైన తోటల్లో మరింత సుందరంగా కనిపించే నోమ్ తోటమాలి అంటే మీకు చాలా ఇష్టం కదూ. పొడవైన ఎర్రటి టోపీ, చేతిలో పైపర్, తెల్లటి గడ్డంతో ఉండే ఈ చిట్టి పొట్టి బొమ్మలు చాలా అందంగా ఉంటాయి. తోటలను కాపలా కాసే ఈ బొమ్మల మీదే 'నోమియో జూలియెట్' హాలీవుడ్ యానిమేషన్ సినిమా వచ్చింది కూడా. ఇంత పాపులరైన నోమ్ బొమ్మలతో పెద్ద పార్కే ఉంది. మధ్య జర్మనీలోని టురెస్టల్‌లో నోమ్ థీమ్ పార్కు ఉంది. అక్కడ సుమారు 2,500కు పైగా ఈ నోమ్ బొమ్మలు కొలువై ఉన్నాయి. ఏటా లక్ష మంది వీటిని చూసేందుకు వెళుతున్నారట. నోమ్‌ల గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలుసుకుందామా.. నోమ్ అంటే భూమిలో నివసించేవాడని అర్థం. నోమ్ బొమ్మల్ని ఇంటి ఆవరణలోని పూల తోటల్లో, లాన్స్‌లో అందంగా అలంకరిస్తారు. అవి తోటమాలిలా మొక్కల్ని కాపాడతాయని నమ్మకం. పంటల్ని, తోటల్ని కాపాడతాడని భావించే గ్రీకో జర్మన్ దేవుడు ప్రియాపస్‌ను పోలి ఈ బొమ్మను తయారు చేశారు.

- నోమ్‌ల్లోను రకాలున్నాయి. చక్రాల బండిని తోసుకెళ్లే నోమ్ పేరు ఇన్‌స్టస్ అని, చేపలు పట్టే నోమ్‌ను హీంజ్ అని, పుస్తకాలు చదివే నోమ్‌ను విల్లీ అని పిలుస్తారు.
- 18వ శతాబ్దంలో మొదట ఈ నోమ్ బొమ్మల్ని తోటల్లో పెట్టడం మొదలుపెట్టారు. తర్వాత ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లను దాటి ప్రపంచమంతా విస్తరించాయి.
- కేవలం జర్మనీలోనే 2.5 కోట్ల నోమ్ ప్రతిమలు ఉన్నాయని అంచనా.
- మొదటి బొమ్మను తయారు చేసిన ఫిలిఫ్ గ్రిబెల్ కుటుంబానికి చెందిన నాలుగో తరం వారు ఇప్పటికీ ఈ ప్రతిమలను తయారు చేస్తున్నారు.
- వీరు తయారు చేసిన ప్రతి నోమ్ బొమ్మకు నేమస్ హోర్టొరామ్ వుల్గారిస్ పేరుతో పుట్టిన తేదీని నమోదు చేస్తారు.
- నోమ్ బొమ్మలంటే పిచ్చిగా ఇష్టపడే కొందరు విరిగిపోయి, పాడైపోతున్న బొమ్మల్ని సేకరించి ఓ సంరక్షణ కేంద్రంలో ఉంచుతున్నారు. నోమ్ బొమ్మల సంరక్షణ కోసం పోరాడుతున్నారు.
- 1997లో ఫ్రాన్స్‌లో గార్డెన్ నోమ్ లిబరేషన్ ఆర్గనైజేషన్‌ను స్థాపించి వాటి హక్కుల కోసం పోరాడుతున్నారు. వారిని చూసి నవ్వుకుంటున్నా పట్టించుకోవడం లేదు.
- మలాగ్ అనే సంస్థ ఇటలీలో నోమ్ బొమ్మల కోసం ఏకంగా ... ఓ సాంక్చ్యురీ కట్టింది.
- ఇంగ్లండ్‌లో నోమ్ రిజర్వ్ ఉంది. దాన్ని ఆన్ ఆట్కిన్ అనే అమ్మాయి1979లో ప్రారంభించింది. విరిగిపోయి, పాడైపోయిన 2000 బొమ్మల్ని ఇక్కడ మరమ్మతు చేసి భద్రపరిచారు.
- 'నోమియో జూలియెట్' సినిమాలో మోంటేజ్, క్యాపులేట్ తోటల్లో ఉండే రెండు నోమ్ జట్లకు ఒకరంటే ఒకరికి పడదు. హీరో నోమియో, హీరోయిన్ జూలియెట్ ప్రేమ వల్ల వాళ్లంతా ఒక్కటవుతారు.

సరైన టోపీ ఏది?

ఇక్కడ ఇద్దరు మిత్రులున్నారు. వారికి చిన్నప్పటి నుంచీ ఒకే రకపు బట్టలు, టోపీలు, బూట్లు... వాడడం అలవాటు. ఇక్కడ కూడా అలాగే వున్నారు. అయితే ఒకరికి టోపీ లేదు. ఆ పైనున్న టోపీల్లో ఏ టోపీ సరైనదో చెప్పుకోండి.



కదలకూడదు మరి

ఇక్కడ కొన్ని ఐస్‌క్రీమ్ పుల్లలు గుట్టగా వున్నాయి. వీటిని ఒక్కొక్కటిగా తీసి పక్కన పెట్టాలి. అయితే ఒకటి తీసేటప్పుడు రెండోది కదలకూడదు. మరైతే ఏ వరుసక్రమంలో తీయాలి. ప్రతి పుల్ల మీద అంకె వేయండి.



గొర్రె బొమ్మ వేద్దాం



రంగులు వేసేద్దామా...

మీకు మిక్కి మౌస్ అంటే చాలా ఇష్టం కదా.. అందమైన ఈ బొమ్మకు రంగులు వేయండి.

జత చేద్దాం

ఇక్కడ కొన్ని పక్షులు...వాటి గుడ్లు, గూళ్ల వున్నాయి. దేనికి ఏదో జత చేయండి చూద్దాం.

మహారచయిత మనో వీధులు...

తెలుగు పాఠకులకు విశేషించి సాహిత్యాభిమానులకు సుపరిచితులైన ప్రసిద్ధుల్లో ప్రథమ శ్రేణిలో వుంటారు త్రిపురనేని గోపీచంద్. ఆయన నవల 'అసమర్థుని జీవయాత్ర' చదివినా చదవకపోయినా ఆ పేరు తెలియని విద్యార్థికులు చాలా తక్కువగానే వుంటారు. ఇక సాహిత్యాభినివేశం కాస్త ఎక్కువగా వున్నవారెవరైనా మెరుపుల మరకలు, చీకటి గదులు, పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా, పోస్టు చేయని ఉత్తరాలు వంటి నవలలను అమితంగా ఇష్టపడతారు. అలాంటి గోపీచంద్ సాహితీ వ్యక్తిత్వాన్ని తెలియజెప్పే సమకాలికుల జ్ఞాపకాల విశ్లేషణల పునర్ముద్రణ ఇది. 1962లో కేవలం 52 ఏళ్ల వయస్సులోనే గోపీచంద్ మరణించినప్పుడు ఆప్తులు ఆత్మీయులు అక్షరాభిమానులు రాసిన నివాళులు,విశ్లేషణలు, కవితలు మొత్తం 64 రచనలున్నాయి. గోపీచంద్ కుమారుడు సినీ నటుడు సాయిచంద్ చొరవతో వచ్చిన ఈ పుస్తకం రచయితను రచనలను గురించి మాత్రమే గాక నాటి నేపథ్యాన్ని గురించి కూడా ఆసక్తికరంగా చెబుతుంది.

గోపీచంద్ ప్రసిద్ధ హేతువాద రచనల అగ్రగామి త్రిపురనేని రామస్వామి చౌదరి కుమారుడు. ఎందుకు అని ప్రశ్నించడం తండ్రి తనకు నేర్పాడంటూ అసమర్థుని జీవయాత్రను ఆయనకు అంకితం ఇచ్చాడు. అయితే చాలా దశాబ్దాల కిందటే నాటి మూఢనమ్మకాలపైన బ్రాహ్మణాధిక్యతపైన కలాన్ని కత్తిలా ఝుళిపించిన రామస్వామి చౌదరికి వున్న దృఢత్వం గోపీచంద్‌కు చివరి వరకూ అంత స్థిరంగా నిలవలేదు. అలాగే తెనాలి వంటి భావ చైతన్య కేంద్రంలో పుట్టి పెరిగిన కారణంగా అభ్యుదయ ఉద్యమ ప్రభావం పడినప్పటికీ అది కూడా ఆఖరు వరకూ లేదు. మధ్యలో దీర్ఘకాలం రాయిస్టుగా ఎం.ఎన్.రాయ్ భావజాలాన్ని ప్రచారం చేసే బాధ్యత తీసుకున్నా మధ్యలోనే వదిలేశారు. ఈ మార్పులు ఎన్ని వున్నా రచయితగా సామాజిక అధ్యయనశీలిగా గొప్ప ప్రతిభా వంతుడు గనక గోపీచంద్ ఎన్నెన్నో ఆణిముత్యాల వంటి కథలు, నవలలు రచించగలిగారు. ఆయన రచనలు చదువుతున్నప్పుడు జీవితాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతి కలుగుతుంది. జీవితం ముందుకు తెచ్చే ప్రశ్నలు ముందుకొచ్చి నిలబడతాయి. ఈ కారణంగానే స్వల్ప జీవితంలోనే అసంఖ్యాక రచనలు చేసి అపారమైన పేరు ప్రఖ్యాతులు సంపాదించగలిగాడు. ఆయన సమాచార శాఖలోనూ ఆకాశవాణిలోనూ కూడా పనిచేశారు. రేడియో నాటికల్లోనూ ప్రతిభ ప్రదర్శించారు.

ఈ పుస్తకంలో ఆయన జీవిత పరిణామాలు మలుపులు మెరుపులతో పాటు ఆయా కథలు నవలల లోతుపాతులు తరచి చూపడం ఎంతో ఉపయోగకరమైన అంశం. పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, రావూరి భరద్వాజ, డి.రాజలింగం,



గోపీచంద్
(సాహితీ వ్యక్తిత్వం)
పేజీలు : 335
వెల : 225/-
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

జాస్తి జవహర్‌లాల్, మండవ శ్రీరామమూర్తి, దుర్గానంద్, టి.జయప్రదాదేవి, ఎన్.వి.బ్రహ్మం వంటి వారు ఈ వివిధ కోణాలను అందించారు. జీవితంలో రకరకాల అనుభవాలు, బాధాతప్త జీవుల ఆవేదనలు, ప్రతిభావంతుల ప్రయోగాలు ఆయన చాలా చేశారు.ప్రేమ వివాహాలు సామాజిక అంతరాల వంటి వాటి ప్రభావాలనూ విశ్లేషించారు. స్త్రీల పరిస్థితిపైన, మనస్తత్వాలపైన ప్రస్తుత సమాజంలో పాతివ్రత్యం పేర ఆమెపై రుద్దిన ఏకపక్ష విలువలపైన గోపీచంద్ ప్రత్యేకంగా కేంద్రీకరించి పలు కథలు రాశారు. ఈ ఏకపక్ష నీతులను స్త్రీలు ప్రశ్నించే కథలు చాలా వున్నాయి. జనానా వంటి కథల్లోనైతే వైవాహిక జీవిత నియమాలను కాస్త ఉల్లంఘించిన ఘటనలూ కనిపిస్తాయి. ఇక ఆయన నవలల్లో అసమర్థుని జీవయాత్రను గురించి కనీసం నలుగురైదుగురు చాలా వివరంగా విశదంగా రాయడం ప్రత్యేకత. తండ్రి నుంచి సంక్రమించిన హేతువాదానికి తర్వాత వచ్చిన మార్పులకు మధ్య నలిగిపోయిన గోపీచంద్ ఆత్మస్వరం కూడా ఈ నవలా నాయకుడైన సీతారామారావు పాత్రలో వుందని విమర్శకులు చెబుతుంటారు. పరమేశ్వర శాస్త్రి వీలునామాలోనైతే అభ్యుదయ వాదాల పట్ల తనకు కలిగిన సందేహాలేమిటో చెబుతాడు. చీకటి గదులు మెరుపుల మరకలు, గడియపడని తలుపులు, యమపాశం వంటి నవలలు ఇంకా బరువైనవి. రాయిస్టు దశలో ప్రధానంగా కథలూ, తర్వాత దశలో నవలలూ రాశారనేది ఒక పరిశీలన. మొదటి దశలో భావాల పైన అధిక శ్రద్ధ చూపితే మలిదశలో శిల్పం, పాత్రలు, కథనం వంటివాటికి అధికతర ప్రాధాన్యతనిచ్చారని విమర్శకులంటారు.

ఇక గోపీచంద్ సినిమా రంగంలోనూ ముఖ్య పాత్ర వహించారనే సంగతి తర్వాతి వారికి అంతగా తెలియదు. ఆయన 'ప్రియురాలు', 'లక్ష్మమ్మ కథ' వంటి చిత్రాలకు దర్శకత్వం కూడా చేశారు. అయితే ఆ సమయంలో రచయిత పైచేయి కావడం వల్ల అవి అంతగా పేరు తెచ్చుకోలేదని విమర్శకుల భావన. లక్ష్మమ్మ కథ విజయం సాధించినా ఆ వైపు తర్వాత కృషి చేయలేదు. అయితే 'కలిమిలేములు, చదువుకున్న అమ్మాయిలు' వంటి చిత్రాలకు రచన చేసి తన సత్తా మరోసారి చాటుకున్నారు.

ఈ విధంగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా వెలిగిన గోపీచంద్‌ను పాఠకులు బాగా అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం ఎంతైనా దోహదకారి. పునరుక్తుల్లాంటివి తగ్గించి, మరింత విమర్శనాత్మకమైన వ్యాఖ్యాతలను కొందరిని చేర్చి వుంటే ఇంకా పరిపూర్ణత వచ్చేది.

-తె.ర

లాలిపాప్‌లే! లాగించొచ్చు!

నీళ్లల్లో స్వేచ్ఛగా సంచరించాల్సిన చేపలు, కప్పలను ఇలా కర్రల మీద వుంచారేంటబ్బా?! అన్న అనుమానం వచ్చేస్తుంది వీటిని చూస్తుంటే. జీవం వుట్టిపడుతున్న ఈ జీవులన్నీ తినదగినవే. నమ్మశ్యంగా లేకపోయినా... నిజానికి ఇవన్నీ లాలిపాప్‌లే. అవన్నీ సజీవమైన జంతువులున్న భ్రమకు గురిచేసిన ఘనత షిన్రీ తెజుకా అనే జపనీస్ శిల్పిది. వీటి రూపశిల్పి ఆయనే. అందుకోసం 'అమెజైకు' అనే 500 ఏళ్లనాటి పురాతన జపనీస్ కళారూపాన్ని వినియోగించాడు. ఇతగాడికి టోక్యోలో ఓ చిన్నపాటి స్వీట్ల దుకాణం వుంది. అక్కడే ఈ తియ్యటి జంతువులను తయారుచేసి సరఫరా చేస్తుంటాడు. 'ఈ కళను ఎవరి దగ్గర నేర్చుకున్నారు?' అంటే... 'ప్రత్యేకంగా పాఠశాలలేం లేవు. స్వయం సాధనతో ఒడిసి పట్టుకోవడమే' అంటాడు తెజుకా నవ్వుతూ. ●

సైబీరియాకు సవాల్

ఆంటోన్ చెకోవ్ చెప్పినట్టు సైబీరియాలో కూడా సంతోషముంది. మంచి ఆరోగ్యమంటే సైబీరియా ఆరోగ్యమని పోలుస్తారు. వేయి మైళ్లు అంత దూరమేం కాదు అనేది వారి సామెత. సబ్‌జీరో ఉష్ణోగ్రతలు వారికి సాధారణం. మైనస్ 60 డిగ్రీ సెల్సియస్ చలి తీవ్రతలోనూ జన సంచారం కనిపిస్తుంది.

యూరల్ పర్వత శ్రేణి నుంచి ప్రపంచంలోనే అతి పెద్ద బైకాల్ సరస్సును దాటుకుని సైబీరియా వ్యాపించింది. ఇక్కడి స్థానిక చక్చీ ప్రజలు రెయిన్‌డీర్‌లను మచ్చిక చేసుకుని జీవనం సాగిస్తారు. వాల్‌రస్‌లను వేటాడతారు. వాటి చర్మంతో చలికి తట్టుకునే దుస్తుల్ని, కొవ్వుతో క్యాండిల్స్ చేసుకుంటారు. రెయిన్ డీర్ ఉన్నితో అల్లే వారి దుస్తులు కళాత్మకతకు చిహ్నం. ఎక్కువ పోషకాలున్న రెయిన్‌డీర్‌లు, గుర్రాలను ఆహారానికి ఉపయోగిస్తారు. అక్కడ కూరగాయలు, పళ్లు పండవు. మాట వింటేనే రోమాలు నిక్కబొడుచుకునే మంచు స్నానం ఆరోగ్యానిస్తుందని, వారు సామూహిక ఉత్సవంగా జరుపుకుంటారు. గడ్డకట్టిన సరస్సును తవ్వి ఆ నీళ్లలో మునక వేస్తారు. సెంట్రల్ రష్యా నుంచి వచ్చిన వారితో సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. అక్కడ టౌనుల్లో ఒపేరాలు, మ్యూజియాలు, బొటీక్స్ కొలువు దీరాయి.

సైబీరియాలోని కొన్ని ప్రాంతాల్లో పెర్మాఫ్రాస్ట్ ప్రభావం ఉంటుంది. అక్కడ అడుగేస్తే గడ్డ కట్టుకుపోయి మంచు శిలైపోతారు. చక్చీ సంప్రదాయం ప్రకారం భౌతిక కాయాల్ని వాల్‌రస్ చర్మ వస్త్రంలో చుట్టి చెట్టుకు వేలాడదీస్తారు. ఎందుకంటే ఉక్కు కన్నా గట్టిగా ఉండే గడ్డకట్టిన నేలను తవ్వడం చాలా కష్టం. అధిక ఉష్ణాన్ని విడుదల చేసే మంట వేశాక గంట తర్వాత కానీ కొద్దిగా నేల కరగదు. అలా మంట తర్వాత మంట వేస్తూ రెండు రోజుల పాటు తవ్వితేనే మృతదేహాన్ని సమాధి చేయగలరు. ఇళ్లను ఎత్తైన కాంక్రీట్ నిర్మాణాల మీద నిర్మిస్తారు. లేకపోతే గడ్డకట్టిన నేల ఇంటి ఉష్ణాన్ని హరించేస్తుంది. వీధుల్లో కారు ఇంజిన్లను ఆపరు. ఆపితే ఇక స్టార్ట్ అవదు. ఉష్ణ గారేజీల్లోనే వాటిని పార్క్ చేస్తారు. ఆరని మంటను వాటి ఇంధన ట్యాంకు కింద వేస్తారు. లోహ పరికరాలు చర్మానికి అతుక్కుపోతాయి. ఎలక్ట్రానిక్ కెమెరాలు పనిచేయవు. ఫిల్మ్‌ను వాడతారు. చలి నుంచి ఉపశమనం కల్గించే రష్యన్ వోడ్కా కూడా గడ్డకట్టేస్తుందిక్కడ. ఇన్ని అవాంతరాలు, సవాళ్లను అధిగమిస్తూ మనుగడ సాగిస్తున్న సైబీరియన్ వాసులకు గర్వం ఉండటంలో ఆశ్చర్యం లేదు.